మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 8-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 159 Issue: 159

08 డిసెంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:38 సూర్యాస్తమయం - సా. 5:37 తిథి చవితి సా. 4:10 వరకు తరువాత పంచమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం పుష్యమి రా. 2:52+ వరకు తరువాత ఆశ్లేష యోగం బ్రహ్మ సా. 4:58 వరకు కరణం భాలవ సా. 4:10 వరకు కౌలవ తె. 3:13+ వరకు వర్జ్యం ఉ. 11:44 నుండి మ. 1:15 వరకు దుర్ముహూర్తం మ. 12:30 నుండి మ. 1:13 వరకు మ. 2:41 నుండి మ. 3:25 వరకు రాహుకాలం ఉ. 8:00 నుండి ఉ. 9:23 వరకు యమగండం ఉ. 10:45 నుండి మ. 12:08 వరకు గుళికాకాలం మ. 1:30 నుండి మ. 2:52 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:02 నుండి తె. 5:50 వరకు అమృత ఘడియలు రా. 8:48 నుండి రా. 10:19 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:30 వరకు గమనిక: "+" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## పవన్ కల్యాణ్ 'అభినవ కృష్ణదేవరాయ'

### బిరుదును ప్రదానం చేసిన ఉడుపి పీఠాధిపతి

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. 'అభినవ కృష్ణదేవరాయ' అనే ప్రత్యేక బిరుదును అందుకున్నారు. కర్ణాటకలోని ఉడిపి పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం నిర్వహించిన బృహత్ గీతోత్సవ మహోత్సవంలో మఠాధిపతి సుగుణేంద్ర తీర్థ స్వామీజీ స్వయంగా ఈ బిరుదును పవన్‌కు ప్రదానం చేశారు.

ఉడుపి, డిసెంబర్ 7 (ఈవార్తలు): పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గీతా సారం, ధర్మతత్వం, తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన ఆత్మీయ అనుభవాల గురించి తెలిపారు. ఈ వేడుకకు తాను ఉప ముఖ్యమంత్రిగా కాకుండా.. ఆధ్యాత్మికతను అన్వేషించే సాధకుడిగా వచ్చానని స్పష్టం చేశారు. నాయకత్వం అంటే పదవులు కాదని.. ప్రజల కోసం తీసుకునే సత్ప్రయత్నాల సమాహారమని తెలిపారు. ఎన్నికల ముందు అర్జునుడి లాంటి సందిగ్ధతను తానూ ఎదుర్కొన్నానని పవన్ గుర్తుచేసుకున్నారు. వ్యక్తిగత లాభనష్టాల కంటే రాష్ట్ర ప్రజల సమగ్ర మేలు ప్రధానమని భావించి పరిమితమైన 21 స్థానాల్లో మాత్రమే పోటీ చేశామని చెప్పారు. భగవద్గీత అనేది పూజా మందిరంలో అలంకరించుకునే గ్రంథం మాత్రమే కాదని,

తరువాయి 2 వ పేజీలో...



# ఇక రైజింగ్

## నిన్నటి వరకు ఒక లెక్క
## నేటి నుంచి మరో లెక్క
## ప్రపంచ వేదికపై రీసౌండ్ చేస్తాం

### ప్రజల ఆశీర్వాదాలే నాకు ధైర్యం.. గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ రైజింగ్‌కు తిరుగులేదని, నిన్నటి వరకు ఒక లెక్క.. గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హైదరాబాద్ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఫ్యూచర్ సిటీ వేదికగా జరిగే ఈ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు తరలివస్తుండటంతో నగరం ఆధునిక హంగులను సంతరించుకుంది.

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఈ తరుణంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ప్రజలకు హృదయపూర్వక సందేశాన్ని అందించారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరిస్తూ, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. 'జాతి కోసం.. జనహితం కోసం.. గొప్ప కలలు కనాలంటే ధైర్యం ఉండాలి.. గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలి' అంటూ తన సందేశాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, గత రెండేళ్లుగా అహర్నిశలు శ్రమించి తెలంగాణను ప్రగతి శిఖరాలపై నిలబెట్టేందుకు తపించానని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమైన వ్యవస్థలను సరిదిద్ది, నిరుద్యోగ యువతకు కొలువుల జాతరతో తరువాయి 2 వ పేజీలో...



# ..కాదు సింకింగ్

### కేసీఆర్ పోయి రేవంత్ వచ్చారంతే... కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలే

### హామీలపై చర్చకు వస్తవా రేవంత్?.. ఇందిరా పార్క్ మహాధర్నాలో కిషన్ రెడ్డి

తెలంగాణ రైజింగ్ కాదని.. అంతా సింకింగేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఎలాంటి తేడా లేదని, ఈ రెండూ కుటుంబ, అవినీతి పార్టీలేనని తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

ఇందిరాపార్క్/హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ 'రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన' పేరుతో ఆదివారం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఒక చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని ఎలా దోచుకుందో చూశామని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోందని ఆరోపించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ, ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏం చేశారని 'ప్రజా పాలన' పేరుతో తరువాయి 2 వ పేజీలో...

# నిన్ను బండ కట్టి ఎత్తేస్తా..



### మునిగితే కాళేశ్వరం ఉన్నట్లు
### తేలితే కాళేశ్వరం కూలినట్లు
### రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్

సీఎం రేవంత్ రెడ్డివి అన్ని అబద్ధాలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మానుకోవాలని హితవుపలికారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు.

సిద్దిపేట, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్నారని అన్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రభుత్వం 49 వేల మంది రైతుల దగ్గర మక్క పంట కొని దాదాపు 450 కోట్ల బకాయి పెట్టిందని తెలిపారు. రెండు రోజుల్లో డబ్బులు వేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పి.. 50 రోజులైనా ఇప్పటికీ రైతులకు డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. రైతులు ఇంకో పంట వేసుకోవడానికి కూడా వారి దగ్గర తరువాయి 2 వ పేజీలో...



# 25 మంది ఆహుతి

### గోవా నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం

పనాజీ: గోవాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలో ఉన్న ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. వంటగదిలో సిలిండర్ పేలడంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'బర్చ్ బై రోమియో లేన్' అనే నైట్‌క్లబ్‌లో తరువాయి 2 వ పేజీలో...



# కేసీఆర్ కాళ్ల దగ్గర..

### విగ్రహం వద్ద మొరుగుతున్నట్లు ఇమేజ్

### ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): గులాబీ కండువా కప్పుకొని, సింహాసనంపై కూర్చొని ఉన్న కేసీఆర్ విగ్రహం వద్ద ఓ కుక్క మొరుగుతున్నట్లు ఉన్న ఏఐ ఫొటోను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ ఫొటోకు ఐవైకేవైకే (తెలిసినవాళ్లకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు) అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ పోస్ట్ పెట్టిన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేటీఆర్ ఈ ఫొటోను ఇప్పుడు ఎందుకు పంచుకున్నారు? ఈ క్యాప్షన్ వెనుక ఉన్న అంతరార్థం ఏంటి? అంటూ నెటిజన్లు రకరకాల ఊహాగానాలతో కామెంట్లు చేస్తున్నారు. కొందరు రాజకీయ కోణంలో విశ్లేషిస్తుండగా, మరికొందరు తమకు తోచిన విధంగా అర్థాలు చెబుతున్నారు. మొత్తానికి, ఎలాంటి వివరణ లేకుండా కేటీఆర్ పెట్టిన ఈ ఒక్క పోస్ట్ బీఆర్ఎస్ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లోనూ తీవ్రమైన క్యూరియాసిటీని రేకెత్తించింది. దీనిపై నెటిజన్ల నుంచి భారీ స్పందన వస్తోంది. 'కేసీఆర్ మహా శిఖరం అని, కుక్కలా మొరిగితే ఏం ప్రయోజనం ఉండదు' అన్నట్లుగా ఈఫొటోఉందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.



# నిన్న 650 విమానాలు రద్దు

### కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం

### శంషాబాద్‌లో 116 ఫ్లైట్స్ క్యాన్సిల్

ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభం కొనసాగుతోంది. ఆరో రోజు ఆదివారం దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల్లో 650 విమానాలు రద్దయ్యాయి. ఇండిగోలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా గత ఆరు రోజుల్లో దాదాపు 3వేలకుపైగా విమానాలు రద్దయ్యాయి. దాంతో దేశంలో విమాన రాకపోకలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. లక్షలాది మంది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నది.

శంషాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు), న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఏకంగా 117 సర్వీసులను రద్దు అయ్యాయి. వరుసగా విమానాలు రద్దు కావడంతో వేల మంది తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్ట్ అధికారుల వివరాల ప్రకారం, ఆదివారం రద్దయిన విమానాల్లో 61 బయలుదేరేవి (డిపార్చర్స్), 56 వచ్చేవి (అరైవల్స్) ఉన్నాయి. శుక్రవారం (155), శనివారం (144) రద్దులతో పోలిస్తే ఈ సంఖ్య కాస్త తక్కువే అయినప్పటికీ, ప్రయాణికుల ఇబ్బందులు మాత్రం తగ్గలేదు. డిసెంబర్ 2 నుంచి తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్‌లోని రోడ్డుకు ట్రంప్ పేరు

### పలు కీలక రోడ్లకు ప్రముఖుల పేర్లు

### తుది నిర్ణయానికి కేంద్రానికి లేఖ



# రెండో విడతలో 415 మంది ఏకగ్రీవం

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,015 |
| వెండి (గ్రాము): | రూ.195.90 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,745 |

## విశ్వవాణి



అంటార్కిటికాలో అంతుబట్టని ఎర్రని రంగు జలపాతం ఒకటి ఉంది. అది అచ్చం రక్తం ఏరులై పారినట్లే కనిపిస్తుంది. పైగా ఎన్ని మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా అది గడ్డ కట్టదు. 1911లో తొలిసారి ఆస్ట్రేలియాకు చెందిన జియాలజిస్ట్ థామస్ గ్రిఫ్ ఈ జలపాతాన్ని గుర్తించారు.



సోమవారం నుంచి తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి తెలంగాణ సెక్రటేరియట్ సింగిడి రంగులు పులుముకున్నట్లు మెరిసిపోయింది.

- ఫోటో: వినోద్ కుమార్, ఈవార్తలు ఫోటోగ్రాఫర్

## రాశి ఫలాలు

8.12.2025

మేషం: ఋణ సమస్యల వలన మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. ఉద్యోగమున అధికారులతో నూతన సమస్యలు తప్పవు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు.

వృషభం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరుల నుండి శు భవార్తలు అందుతాయి. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

మిధునం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొన్ని వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ధన వ్యవహారాలు అంతగా కలసిరావు. నూతన వ్యాపారాల ప్రారంభానికి అవరోధాలుంటాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటా బయట గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. నూతన విషయాలపై దృష్టి సారిస్తారు. విద్యార్థులు కష్టానికి తగిన ఫలితం పొందుతారు. ఆదాయమార్గాలు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులు సహాయంతో పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఇంటాబయట కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి.

సింహం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. చిన్ననాటి మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారమున తొందరపాటు నిర్ణయాలు తీసుకుని నష్టపడతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి విమర్శలు తప్పవు. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి.

కన్య: నూతన కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చూడతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించి పాత ఋణాలు తీరుస్తారు. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు కలసి వస్తాయి. మిత్రులతో దూర ప్రయాణ సూచనలున్నవి. వ్యాపార విస్తరణకు నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన పురోగతి లభిస్తుంది.

తుల: ఉద్యోగమున అందరితో సఖ్యతగా వ్యవహరించిన ప్రశంసలు అందుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో సమస్యలను అధిగమించి లాభాలు పొందుతారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. విద్యార్థులు నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో ఊహించని స్థానచలన సూచనలు ఉన్నవి. ఇంటాబయట ఒత్తిడులు అధికమవుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. పితృవర్గం వారితో మాట పట్టింపులుంటాయి. అనారోగ్య సమస్యలను అశ్రద్ధ చేయడం మంచిది కాదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది.

ధనస్సు: వ్యాపారాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. నిరుద్యోగప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంతాన వివాహ విషయమై ప్రస్తావన వస్తుంది. గృహనిర్మాణ పనులు వేగవంతం చేస్తారు. ఉ ద్యోగమున మీ మాటకు విలువ మరింత పెరుగుతుంది. ఇతరుల అవసరానికి సైతం ధన సహాయం చేస్తారు. వివాదాలకు సంభందించి కీలక సమాచారం అందుతుంది.

కుంభం: ఆర్థిక వ్యవహారాలు ఆశజనకంగా ఉంటాయి. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపార ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు.

మీనం: ఉద్యోగమున చిన్న పాటి ఇబ్బందులు తప్పవు. ఆర్థిక వ్యవహారాలు మందగిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు. నూతన పెట్టుబదుల విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. సంతాన విద్యా విషయాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా పడుతాయి.



# ఇక రైజింగ్

మొదటి పేజీ తరువాయి

కొత్త భరోసా కల్పించామని తెలిపారు. రుణభారంతో కుంగిపోయిన రైతులకు అండగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థికంగా చేయూతనివ్వడంతో పాటు, కేవలం కొద్దిమందికే పరిమితమైన వ్యాపార రంగాన్ని బలోపేతం చేశామని వివరించారు. సామాజిక న్యాయం తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, బలహీన వర్గాల వందేళ్ల ఆకాంక్ష అయిన కులగణన చేపట్టామని, మాదిగ సోదరుల దశాబ్దాల ఉద్యమానికి ఎస్సీ వర్గీకరణ ద్వారా న్యాయం చేశామని తెలిపారు. విద్యను బతుకుదెరువుకు బ్రహ్మాస్త్రంగా భావించి, 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల' నిర్మాణానికి పునాదులు వేశామని, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం అనే మూల సిద్ధాంతాలతో ముందుకు సాగుతూ, ప్రజాకవి అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి రాష్ట్ర అధికారిక గీతంగా గుర్తింపునిచ్చామని చెప్పారు. ఈ రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తావిస్తూ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నధాన్యాలకు రూ.500 బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మార్చే పథకాలు తమ పాలనకు నిదర్శనాలని అన్నారు. కేవలం నేటి అవసరాలు తీర్చడమే కాకుండా, 2047 నాటికి స్వతంత్ర భారతావని వందేళ్ల మైలురాయికి చేరేనాటికి తెలంగాణ ఎలా ఉండాలనే దానిపై లోతైన అధ్యయనంతో ఒక మార్గదర్శక పత్రాన్ని సిద్ధం చేశామని వెల్లడించారు. 'గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు ప్రాణం పోసి, తెలంగాణ రైజింగ్ ప్రణాళికలతో ప్రపంచ వేదికపై రీసౌండ్ చేయడానికి సిద్ధమయ్యాం. నిన్నటి వరకు ఒక లెక్క... రేపటి గ్లోబల్ సమ్మిట్ తర్వాత మరో లెక్క" అని సీఎం తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలు ఇచ్చిన ఓటు, వారి ఆశీర్వాదాలే తనకు ధైర్యాన్ని, సంకల్పాన్ని ఇచ్చాయని, వారి ప్రేమాభిమానాలే తనకు సర్వస్వమని తెలిపారు. "తెలంగాణ నాకు తోడుగా ఉన్నంత వరకు... ఈ గొంతులో ఊపిరి ఉన్నంత వరకు... తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదు' అని పేర్కొన్నారు.



# ..కాదు సింకింగ్

మొదటి పేజీ తరువాయి

ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. "కేసీఆర్ పోయి రేవంత్ రెడ్డి వచ్చారంతే.. పాలనలో, దోపిడీలో ఎలాంటి మార్పు లేదు" అని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని సీఎంను నిలదీశారు. నిరుద్యోగ భృతి రూ.4 వేలు, వృద్ధులు, వికలాంగులకు పెన్షన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ వంటి హామీల గతి ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బెల్ట్ షాపులను రద్దు చేస్తామని చెప్పి, ఇప్పుడు మద్యం అమ్మకాలతో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. ఈ రెండేళ్లలో ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే, తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ ధర్నాలో బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పవన్ కల్యాణ్ 'అభినవ కృష్ణదేవరాయ'

మొదటి పేజీ తరువాయి

ప్రతి మనిషి జీవితంలో ఎదురయ్యే సందేహాలు, సంఘర్షణలు, నిర్ణయాలకు పథనిర్దేశం చేసే ఆధ్యాత్మిక శక్తి అని పవన్ అభిప్రాయపడ్డారు. నేటి యువత ఎదుర్కొంటున్న సమాచార భారాలు, కెరీర్ ఒత్తిడులు, గుర్తింపు సంక్షోభం వంటి ఆధునిక కురుక్షేత్రాలను ఎదుర్కొనేందుకు గీత అందించే మానసిక బలం అత్యవసర మని తెలిపారు. భారత భూమి ఎన్నో దౌర్జన్యాలను అధిగమించి నిలబడటానికి కారణం ఆయుధ శక్తి కాదని.. ధర్మాన్ని నిలబెట్టిన గ్రంథాలు, సాధువులు, సంప్రదాయాలు, పవిత్ర సంస్థలే అని ఆయన చెప్పారు. ఐన్‌స్టీన్, ఓపెన్‌హైమర్ వంటి మహామేధావులు గీత ద్వారా ప్రభావితులైన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు ఉడిపి వంటి పుణ్యక్షేత్రాల్లో ఒకేచోట చేరడం 'వసుధైవ కుటుంబకం' అనే భారతీయ తత్వానికి జీవం పోస్తుందని.. జగద్గురు మధ్వాచార్యుల శాశ్వత వారసత్వం ఆధ్యాత్మిక సంపదను కాపాడిందని, అలాంటి వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యతని.. భారత ఆధ్యాత్మిక ధారలో ఎంత ప్రధాన పాత్ర వహించాయో గుర్తుచేస్తూ, అలాంటి వారసత్వాన్ని కాపాడడం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అంతకు ముందు పవన్ కల్యాణ్ ఉడిపి క్షేత్రంలో శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం మఠాధిపతి పరమ పూజ్య సుగుణేంద్ర తీర్థ స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు.



# నిన్న 650 విమానాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

ఇప్పటివరకు శంషాబాద్ విమానాశ్రయంలో 500కు పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. విమానాల రద్దుతో ఆగ్రహానికి గురైన ప్రయాణికులు ఇండిగో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అదనపు భద్రతను ఏర్పాటు చేసింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, విశాఖపట్నం, గోవా వంటి కీలక మార్గాల్లో సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా నష్టపోయారు. మరోవైపు, విశాఖపట్నం విమానాశ్రయంలో కూడా 10 ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్పైస్‌జెట్ అదనపు విమానాలను నడుపుతోంది. ఆర్టీసీ బెంగళూరు, చెన్నై, విజయవాడ, రాజమండ్రి వంటి నగరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. దక్షిణ మధ్య రైల్వే కూడా చెన్నై, ముంబై, కోల్‌కతాలకు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. విమానాశ్రయంలో చిక్కుకుపోయిన అయ్యప్ప భక్తుల కోసం కొచ్చికి కొన్ని ప్రత్యేక విమానాలను నడిపారు.

## రెండో విడతలో 415 మంది ఏకగ్రీవం

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 415 మంది సర్పంచ్‌లు, 8,304 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అత్యధికంగా కామారెడ్డిలో 44, నల్గొండ, నిజామాబాద్‌లో 38 చొప్పున ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో 4,332 పంచాయతీలు, 38, 322 వార్డుల్లో ఎన్నికల కోసం ఎస్ఈసీ నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే..5 గ్రామపంచాయతీలు, 107వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. సర్పంచ్ ఎన్నిక నుంచి 7,584 మంది.. వార్డుల్లో 10,427 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొదటి విడతతో కలిపి 810 మంది సర్పంచ్‌లు, 17, 635 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

# నిన్ను బండ కట్టి ఎత్తేస్తా..

మొదటి పేజీ తరువాయి

డబ్బులు లేవని చెప్పారు. యాసంగి పంట వేసుకోవడానికి డబ్బులు లేక పెట్టుబడి కోసం రైతులు మద్దతు ధర కంటే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మక్క రైతులకు బాకీ పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు బకాయి పడ్డ 45కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి బతుకమ్మ పండుగకు చీరెలు ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ రేవంత్ రెడ్డి ఒక్కసారి ఇచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఓటు అడగాలి అంటే ముందు మహిళలకు బకాయి పడ్డ 60వేలు ఇవ్వాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను చిత్తు చిత్తు గా ఓడించాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతులకు బోనస్ పడాలి అంటే కాంగ్రెస్‌ను ఓడించాలని అన్నారు. వచ్చే ఏడాది నుంచి పంట వేస్తేనే రైతుబంధు ఇస్తామని తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారని హరీశ్‌రావు తెలిపారు. నేటికి పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. కాళేశ్వరం కూలిందని %% కేసీఆర్, హరీశ్‌రావులను బండకేసి కొట్టాలని రేవంత్ రెడ్డి మాట్లాడిందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సిద్దిపేటకు రా.. రంగనాయక సాగర్ లో బండ కట్టి నిన్ను ఎత్తేస్తా.. నువ్ మునుగుతవో.. తేలుతవో చూద్దామని వ్యాఖ్యానించారు. రంగనాయక సాగర్‌లోనీళ్ళుండి నువ్ మునిగితే కాళేశ్వరం ఉన్నట్టు.. నువ్ తేలితే కాళేశ్వరం కూలినట్టు అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి వి అన్ని అబద్ధాలు, ఆయన చిల్లర మాటలు మానుకోవాలని హితవు పలికారు.

# హైదరాబాద్‌లోని రోడ్డుకు ట్రంప్ పేరు

## పలు కీలక రోడ్లకు ప్రముఖుల పేర్లు.. కేంద్రానికి లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కీలక రోడ్లకు ప్రముఖ వ్యక్తులు, సంస్థల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవుటర్ రింగ్ రోడ్డు వద్ద రావిర్యాల నుంచి ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించారు. రావిర్యాల ఇంటర్ ఛేంజ్‌కు ఇప్పటికే టాటా ఇంటర్‌చేంజ్ అని పేరు పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఓ రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ అని పేరు పెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదన సిద్ధం చేసింది. తుది నిర్ణయం కోసం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖలు రాయనుంది. ఐటీ కారిడార్‌లో ముఖ్యమైన రోడ్లకు గూగుల్ స్ట్రీట్, మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వటంతో పాటు, హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఆ రోడ్లపై ప్రయాణించే వారికి కూడా స్ఫూర్తిమంతంగా ఉంటుందనే ఉద్దేశంతో సీఎం ఈ ప్రతిపాదన చేశారు.

# అగ్ని ప్రమాదం.. 25 మంది ఆహుతి

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో నలుగురు పర్యాటకులు ఉండగా, మిగిలిన వారంతా క్లబ్ సిబ్బంది అని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. మృతుల్లో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు మంటల్లో సజీవదహనం కాగా, 20 మంది పొగకు ఊపిరాడక చనిపోయారని పోలీసులు వెల్లడించారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద వార్త తెలియగానే ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, స్థానిక ఎమ్మెల్యే మైఖేల్ లోబోతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ దుర్ఘటనపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించినట్లు ప్రకటించారు. క్లబ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించలేదని ప్రాథమికంగా తెలిసిందని, విచారణలో నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలోని అన్ని నైట్‌క్లబ్‌లలో తనిఖీలు చేపడతామని, అనుమతులు లేని వాటి లైసెన్సులు రద్దు చేస్తామని ఎమ్మెల్యే మైఖేల్ లోబో తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





# గ్లోబల్ సమ్మిట్‌తో తెలంగాణకు కొత్త దిశ

**ప్రపంచ ఉన్నత నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**


హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ తో తెలంగాణ రాష్ట్రం దిశ దిశ మారుతుందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీర్ ఖాన్ పేట్ లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఈ ప్రపంచ స్థాయి సమ్మేళనంతో ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రెండేళ్ల పాలన, 2047 లక్ష్యంగా సాగుతున్న ప్రణాళికలు తదితరాలకు ఊతమిచ్చే విధంగా పెట్టుబడులు రానున్నాయని అన్నారు ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు ఈ సమ్మిట్ లో పాల్గొనబోతున్నారని చెప్పారు రెండు రోజులపాటు జరిగే ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీ

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. ఆదివారం (డిసెంబర్7) భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం.. దేశ, విదేశాలనుంచి నేతలు ప్రతినిధులు వస్తున్నారు..ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిజిటల్ టన్నెల్, సెషన్ హాల్ లను పరిశీలించిన మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ఆర్టీసీలో మొదటి తరం అల్బేన్ ఎలక్ట్రిక్ బస్సును ఆసక్తిగా తిలకించారు. ఆర్టీసీ అభివృద్ధికి చిహ్నంగా ఈ బస్సును ప్రదర్శనలో ఉంచారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ పెరుగుతుందన్న మంత్రి పొన్నం ప్రభాకర్.. ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నయన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆర్ ఎండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



## అతిథులకు అదిరిపోయే బహుమతులు

**జీవితాంతం గుర్తుండిపోయేలా గిఫ్ట్స్**

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల నుంచి యాజమాన్య ప్రతినిధుల బృందాలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఒక్క అమెరికా నుంచే వివిధ కంపెనీలకు చెందిన 46 మంది ప్రతినిధులు తరలివస్తున్నారు. తొలిరోజు సోమవారం మధ్నాహ్నం 1.30 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సదస్సును లాంఛనంగా ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభ వేడుకకు హాజరవుతున్నారు. సదస్సులో వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా-టెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్నైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్-షాతో పాటు ఇతరులు ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదస్సునుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వం వైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల సదస్సులో మొత్తం 27 అంశాలపై చర్చలు జరగనున్నాయి. అందుకు వీలుగా సెమినార్ హాళ్లను అధికారులు సిద్ధం చేశారు. సదస్సు నిర్వహిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాంగణమంతా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. సదస్సులో పాల్గొనే ప్రతినిధులను ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో ప్రత్యేక సంగీత కచేరితో అలరించనున్నారు. అలాగే తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మరోవైపు నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్క్ బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం సందర్శించేలా పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అతిథులను తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లతో కూడిన బహుమతిని అందించనున్నారు.

## 9న విజయ్ దివస్

**రాష్ట్రవ్యాప్త సంబరాలకు కేటీఆర్ పిలుపున**

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడిన చారిత్రక దినమైన డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా 'విజయ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష ఫలించిన రోజును పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నాయకులతో సమావేశమైన కేటీఆర్, ప్రతి నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో సంబరాలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఒక మైలురాయి అని, ఆ రోజును ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న నిరాహార దీక్ష ప్రారంభించగా, తీవ్రమైన ఉద్యమ ఒత్తిడి నేపథ్యంలో 10 రోజుల తర్వాత డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ చారిత్రక నేపథ్యాన్ని స్మరించుకుంటూ వేడుకలు జరపాలని కేటీఆర్ తెలిపారు. "తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం చేసిన పోరాట ఫలితాలు మనకు గర్వకారణం. దీక్ష ద్వారా సాధించిన విజయాన్ని జరుపుకుందాం" అని ఆయన అన్నారు. ఈ వేడుకల నిర్వహణ కోసం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తోంది. పార్టీ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పార్టీ నాయకులు భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**హైదరాబాద్‌లోని లాలాగూడలో ఘోరం**

లాలాగూడ/హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ఇవాళ తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలాపేటలో అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురు స్నేహితులు కీసర నుంచి తార్నాకకు టిఫిన్ చేసేందుకు కారులో బయలుదేరారు. ఉదయం సుమారు 6 గంటల సమయంలో లాలాపేట వద్దకు రాగానే, కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

# స్పీకర్ గారూ.. ఏమైంది?

**అసెంబ్లీలో తీవ్ర లోపాలు.. జంపింగ్‌లపై వేటులో జాప్యం**

**సభ కమిటీలేవి? డిప్యూటీ స్పీకర్ నియామకమేది?**

**స్పీకర్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ**

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఘాటు లేఖ రాశారు. గడిచిన రెండేళ్లుగా శాసనసభలో తీవ్రమైన లోపాలు జరుగుతున్నాయని, ఇది శాసనసభ రాజ్యాంగబద్ధమైన విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ లేఖను విడుదల చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై హరీశ్ రావు తన లేఖలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 10 మంది ఎమ్మెల్యేలపై తాము పిటిషన్లు దాఖలు చేసినా, వాటిపై నిర్ణయం తీసుకోకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 191(2)ను ఉ



ల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర హెచ్చరికలను కూడా ఆయన గుర్తుచేశారు. "ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్" అన్న చందంగా ఎమ్మెల్యేల పదవీకాలం ముగిశాక తీర్పు ఇస్తే ప్రయోజనం ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. గడిచిన రెండేళ్లుగా సభా కమిటీలను ఏర్పాటు చేయకపోవడం, డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం వల్ల ప్రివిలేజ్ కమిటీ వంటివి పనిచేయడం లేదని హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ పనిదినాలు గణనీయంగా తగ్గిపోయాయని, ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులకు సరైన అవకాశం ఇవ్వడం లేదని, అన్‌స్టార్డ్ ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు రావడం లేదని పేర్కొన్నారు. ఈ లోపాలను సరిదిద్దేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ హరీశ్ రావు సూచనలు చేశారు. ఏడాదికి కనీసం 30 రోజులు సభను నిర్వహించాలని, సభా కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, డిప్యూటీ స్పీకర్ ఎన్నికను పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లేఖ ప్రతిని శాసనసభా వ్యవహారాల మంత్రికి కూడా పంపిన హరీశ్ రావు, సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# నెలకు 2 లక్షల టన్నుల యూరియా

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): వరి వేస్తే ఉరి అంటూ ప్రచారం చేసిన నాయకులు బోనస్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మండిపడ్డారు. లక్ష రుణమాఫీ చేయడానికే ఆపసోపాలు పడి వాయిదాల పద్దతిలో ఒకసారి, ఆఖరి సంవత్సరంలో సగం మందికి కూడా చేయలేక చేతులేత్తేసిన ఎద్దేవా చేశారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ.. గత పాలన నిర్వాకంతో రైతులలో పూర్తిగా నమ్మకాన్ని కోల్పోయారని ఉప ఎన్నికల్లో పట్టణ ప్రజల్లో కూడా ఆ పార్టీకి ఉన్న వ్యతిరేకతను చవిచూశారని పేర్కొన్నారు. మళ్ళీ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించాలనే అన్న ప్రకటనలు చూస్తుంటే వారు భ్రమల నుండి బయటకు రాలేదన్నారు. గత రెండు సంవత్సరాలలో లక్ష కోట్లకుపైగా నిధులను రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన రేవంత్ ప్రభుత్వం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని రైతులకు అందించిన ఘనత మా ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడకుండా రైతుల అవసరాలు తీర్చడానికి నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర మంత్రులను కలవడం, తాను




కేంద్రంతో భేటీలు జరపడం, అధికారులు కేంద్ర ఎరువుల శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో కేంద్రం చివరకు సానుకూలంగా స్పందించి ఈ నెలలో అదనంగా యూరియా సరఫరా చేసిందని తెలిపారు. రానున్న రబీ సీజన్ ను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రతి నెలకు 2 లక్షలకు తగ్గకుండా యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్టు చెప్పారు. రబీ సీజన్ కు వాస్తవ ప్రణాళిక 10.40 లక్షల మెట్రిక్ టన్నులు అని, ఖరీఫ్ లో జరిగినట్టుగా రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా రబీ సీజన్ మొదటి 3 నెలల్లో 6 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా యూరియాను సరఫరా చేయాలని కోరినట్లు వెల్లడించారు. మా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తూ, అందుకు అనుగుణంగా అటు కేంద్రంతో, ఇటు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలలో రాష్ట్రం అందిస్తున్న మద్దతుతో తెలంగాణ రైతులు ఆయిల్ పామ్ సాగులో దేశానికే ఆదర్శంగా నిలువగా, వరి ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణను నిలబెట్టారు.

## చలిలో అడవిలోనే రైతుల నిద్ర

**అధికారులు భూములు లాక్కుంటారన్న భయం**

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన**

కాగజ్ నగర్, డిసెంబర్ 7 (ఈవార్తలు): తమ భూములు ఎక్కడ ఫారెస్ట్ అధికారులు లాక్కుంటారోనని, దిందా గ్రామ ఎస్సీ రైతులు రాత్రి సమయంలో పిల్లల్ని వదిలేసి దట్టమైన అడవిలో తీవ్రమైన చలిని లెక్కచేయకుండా పడుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చింతల మానేపల్లి మండలం దిందా గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామస్థుల బాధలు విని చలించారు. ఫారెస్ట్ అధికారులు మొదట ఎస్సీ వర్గాలకు చెందిన రైతులను వ్యవసాయం చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం తెలుపకుండా, ఇటీవల ఎస్సీలకు చెందిన సుమారు 50 ఎకరాల భూమిని ఆక్రమించుకునేందుకు ట్రెంచ్ వేసి, రైతులను వారి భూములకు రానివ్వకుండా. అడ్డుకుంటుండగా, భూమి లేకపోతే మాకు చావే దిక్కు అంటూ, ఎలాగైనా తమ భూములను కాపాడుకోవాలని రైతులు రాత్రింబవళ్లు ఇండ్లు వదిలి భూమిలోనే ఉంటున్నారు. ఈ రోజు రైతుల భూములను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అటవీ అధికారులు కలిసి రైతులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుల మీద వణ్యప్రాణులు దాడి చేసి చంపితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఎస్సీ వర్గాల ప్రజల వెనుక ఎవరూ లేరన్న భరోసాతోనే అధికారులు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు అటవీ శాఖ మంత్రి సురేఖ, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్ వంటి మంత్రులు ఇక్కడికి వచ్చి పడుకుంటే ఈ రైతుల బాధలు ఏంటో అర్థం అవుతాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వంద ఎకరాల అడవిని నరికి,వణ్యప్రాణులను చంపితే ఆనాడు,ఈ అటవీ అధికారులు ఎక్కడ పోయారని ప్రశ్నించారు. వెంటనే జాతీయ ఎస్సీ కమీషన్ మెంబర్ కు ఫోన్ చేసి దిందాలో ఉన్న ఎస్సీ రైతుల భూములను కాపాడాలని కోరారు. వారికి బతకడానికి భూమి తప్ప వేరే ఆధారం లేదన్నారు. జాతీయ ఎస్సీ కమీషన్ నుండి వెంటనే ఫారెస్ట్ అధికారులకు నోటీసులు ఇచ్చి భూములు కాపాడాలన్నారు. అవసరమైతే మానవ హక్కుల కమీషన్ ను ఆశ్రయిస్తామని, హై కోర్టుకు వెళ్లి పేద రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దిందా రైతులకు భూముల సమస్య స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు వల్లనే ఎదురైందన్నారు. అసెంబ్లీ వేదికగా దిందా రైతులు టేకు చెట్లు నరికారని నిందలు వేశారన్నారు. ఈ రోజు రైతులు అడవిలో పడుకునే పరిస్థితి వస్తే ఎందుకు ఫారెస్ట్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడటం లేదని నిందించారు. రైతుల భూములు వారికి దక్కేవరకు అడవిలోని వారి భూముల్లోనే పడుకుంటారని,చావైనా బతుకైనా వారికి భూమిలోనే అంటూ రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. అందుకే అలాంటి దొంగల నాయకులను నమ్మొద్దన్నారు. కొంత మంది దొంగలు మద్యం, డబ్బు పంచి మళ్లీ మోసం చేస్తారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. భూమి సమస్య తీరేదాక రైతుల వెంట మేం ఉంటామని మాటిచ్చారు. గెలిపించాలని కోరారు. కోయపల్లిలో ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డుమెంబర్లను అభినందించారు. కర్జవెల్లి, చింతలమానెపల్లి, బాబాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి అబ్దుల్ సలీం చింతల మానేపల్లి మండల కన్వీనర్ గోమాసె లహెంచు, ఉపాధ్యక్షులు భాస్కర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మెస్సీతో రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్

**ఉప్పల్ స్టేడియంలో ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష**

ఉప్పల్/హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని జట్ల మధ్య జరగనున్న ఎగ్జిబిషన్ మ్యాచ్ ఏర్పాట్లపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి డి. శ్రీధర్ బాబు ఆదివారం సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 13న జరగనున్న ఈ మ్యాచ్ కోసం చేస్తున్న సన్నాహాలను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తదితర ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, వేలాది మంది అభిమానులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, భద్రత, సౌకర్యం దృష్ట్యా అందరూ ముందుగానే వచ్చి తమ సీట్లలో కూర్చోవాలని సూచించారు. మెస్సీకి కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని, ఆయనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర వీఐపీల రాకపోకల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు భద్రతా ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. 'తెలంగాణ రైజింగ్' వేడుకల్లో భాగంగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి మెస్సీ స్వయంగా ఆసక్తి చూపారని భట్టి పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌తో పాటు 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమానికి మెస్సీని గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. క్రీడలు, పర్యాటకం, పెట్టుబడుల ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఈ మ్యాచ్ కేవలం స్నేహపూర్వకమైనదే కాదని, ఒక సామాజిక లక్ష్యం కోసం మెస్సీ ఇక్కడికి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'రేవంత్ రెడ్డి 9 వర్సెస్ లియోనెల్ మెస్సీ 10' పేరుతో జరిగే ఈ మ్యాచ్‌లో సీఎం జెర్సీ నంబర్ 9 ధరించనుండగా, మెస్సీ తన ఫేమస్ జెర్సీ నంబర్ 10తో బరిలోకి దిగనున్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన కొంతమంది విద్యార్థులకు సీఎం జట్టులో ఆడే అవకాశం కల్పించనున్నారు.

## ఈ-పాన్ కార్డు పేరిట మోసాలు

**పౌరులను అప్రమత్తం చేసిన ఆదాయ పన్ను శాఖ**

**వ్యక్తిగత, ఆర్థిక వివరాలను అడగబోమని స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: ఈ-పాన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోమంటూ వస్తున్న నకిలీ ఈ-మెయిల్స్ పట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఆదాయ పన్ను శాఖ హెచ్చరించింది. ఇలాంటి మోసపూరిత మెయిల్స్‌ను నమ్మవద్దని, వాటికి స్పందించవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సహకారంతో ఆదివారం ఒక ఫ్యాక్ట్-చెక్ హెచ్చరికను జారీ చేసింది. ఆదాయ పన్ను శాఖ పేరుతో పంపే ఈ-మెయిల్స్‌లో ఎప్పుడూ వ్యక్తిగత వివరాలు, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు లేదా క్రెడిట్ కార్డు, బ్యాంకు ఖాతాల వంటి ఆర్థిక సమాచారాన్ని అడగబోమని ఐటీ శాఖ స్పష్టం చేసింది. ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు పంపే "ఈ-పాన్ కార్డు డౌన్‌లోడ్‌కు దశలవారీ సూచనలు" అనే నమూనా ఈ-మెయిల్ స్క్రీన్‌షాట్‌ను కూడా పీఐబీ విడుదల చేసింది. అనుమానాస్పద ఈ-మెయిల్స్ వస్తే వాటిని తెరవొద్దని, వాటిలోని అటాచ్‌మెంట్లను క్లిక్ చేయవద్దని శాఖ సూచించింది.



# విషాహారం తిని 100 గొర్రెలు మృతి

మల్యాల, డిసెంబర్ 7 (ఈవార్తలు): విషాహారం తిని దాదాపు 100 గొర్రెలు మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని రామన్నపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూకపెల్లి శివారులోని ఓ రైస్ మిల్ ప్రాంతంలో తడుక గంగన్న చెందిన 50 గొర్రెలు, దండిక మల్లేశం కి చెందిన 30 గొర్రెలను గత కొద్ది రోజులుగా పొలాల్లో మేపుతున్నారు. అయితే విషపు ఆహారం తినడం వలన శనివారం రాత్రి 50 గొర్రెలు, ఆదివారం 50 గొర్రెలకు పైగా మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.80 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు గొర్రెల కాపరులు వాపోయారు. అస్వతకు కు గురైన గొర్రెలకు వెటర్నిటీ డాక్టర్లు వచ్చి చికిత్స అందించినప్పటికీ అప్పటికే ప్రయోజనం లేకుండా పోయింది. భారీ సంఖ్యలో గొర్రెలు చనిపోవడంతో గొర్రెల కాపరులు రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# గోషామహల్‌లో విజయ్ దివస్ సంబురాలు

**బీఆర్ఎస్ ఇంచార్జి ఆర్వీ మహేందర్ కుమార్**



బ్యాంక్ స్ట్రీట్(కోఠి)/హైదరాబాద్, డిసెంబర్ 7 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో చారిత్రాత్మక రోజు డిసెంబర్ 9వ తేదీని పురస్కరించుకుని 'విజయ్ దివస్' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్వీ మహేందర్ కుమార్ తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అధ్యక్షులు తమ తమ డివిజన్లలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి డివిజన్ కేంద్రంలో పార్టీ జెండాను ఎగురవేయాలని, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని, ప్రధాన కూడళ్లలో విజయానికి సూచికగా పింక్ బెలూన్లను గాలిలోకి ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు.




# 11న కడప మేయర్ ఎన్నిక

కడప, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఏపీలోని కడప నగర పాలక సంస్థ మేయర్ పదవికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 11వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి కొత్త మేయర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్ నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్ ప్రకారం, ఈ నెల 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు పాల్గొని నూతన మేయర్‌ను ఎన్నుకుంటారు. అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో వైసీపీ నేత, నాటి మేయర్ వి. సురేష్ బాబును పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంను తాత్కాలిక మేయర్‌గా నియమించారు. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుండటంతో, నగర అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు పూర్తిస్థాయి మేయర్‌ను ఎన్నుకోవడం అనివార్యంగా మారింది. ఇదిలా ఉండగా, తనను పదవి నుంచి తొలగించడాన్ని, ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ సురేష్ బాబు హైకోర్టును ఆశ్రయించారు.



# జగన్ సీఎం కావాలని శబరిమలలో పూజలు

శబరిమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ఏపీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ శబరిమలలో పలువురు అయ్యప్ప మాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. రేగిడి మండలం లచ్చన్నవలస గ్రామానికి చెందిన 20 మంది భక్తులు 41 రోజుల కిందట అయ్యప్ప దీక్ష ప్రారంభించారు. దీక్ష ముగియడంతో శబరిమల యాత్రకు వెళ్లిన వీరంతా అక్కడ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ ఆలయానికి చేరుకున్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అయ్యప్పను ప్రార్థించారు. అలాగే తాజాగా వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ అయ్యప్ప భక్తులతో కలిసి.. జగన్ ఫ్లెక్సీతో తిరువూరు ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా రాము కొండకు పాదయాత్రగా వెళ్లారు. జగనన్న మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం బాగుంటుందని, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని రాము ఆకాంక్షించారు.

# అహోబిలం చోరీతో సంబంధం లేదు

**ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం**

విజయవాడ, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో హుండీ నుంచి నగదు దొంగిలింపు ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి టీడీపీ ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడం కలకలం రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో హుండీ నుంచి నగదు దొంగిలింపు ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి టీడీపీ ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడం కలకలం రేపింది. అయితే ఈ కేసును స్థానిక ఎమ్మెల్యే (టీడీపీ) సెటిల్ చేశారనే ఆరోపణలు రావడం కలకలం రేపింది. అయితే ఇందుకు సంబంధించి ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. కొద్ది నెలల క్రితం అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. అయితే ఇందులో నలుగురు సిబ్బంది ప్రమేయం ఉండటంతో... అప్పట్లోనే పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగిలించబడిన రూ. 82,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే అహోబిలం హుండీ చోరీ కేసును టీడీపీ ఎమ్మెల్యే సెటిల్ చేశారని వైసీపీ నేతలు ఆరోపణలు చేయడమే కాకుండా... ఇందులో సీఎం చంద్రబాబు వాటా ఎంత అని ప్రశ్నించారు. ఈ పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇందుకు సంబంధించి ఏపీ ఫ్యాక్ట్ చెక్ విభాగం క్లారిటీ ఇచ్చింది. అహోబిలం హుండీ చోరీ కేసు విషయంలో స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తూ, సీఎం నారా చంద్రబాబునాయుడును కించపరుస్తూ ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం... ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో లేదని తెలిపింది. "ఏపీ దేవాదాయ ధర్మాదయ శాఖ... అహోబిలం దేవస్థానానికి కార్యనిర్వహణాధికారిని నియమించగా దానిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తమిళనాడులో ఉన్న అహోబిల మఠం వారు గతంలో కోర్టుకు వెళ్లారు. మఠంవారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పు చెప్పడంతో ఆ దేవస్థానం విషయంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదు" అని తెలిపింది. అహోబిలం ఆలయంలో చోరీకి సంబంధించి ఆళ్లగడ్డ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపింది. "ఆ కేసు ప్రకారం... ఈ ఏడాది జూన్ 26న అదే దేవస్థానంలో పని చేస్తున్న ఏ నరసింహ, సుబ్బారాయుడు, నిరంజన్, ఎలక్ట్రీషియన్ ఎన్‌పీ ఆచారి అనే నలుగురు వ్యక్తులు హుండీలో చోరీకి పాల్పడ్డారు. ఈ విషయాన్ని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జేజీ సుందరరాజన్ సీసీటీవీ ఫుటేజి లో చూసి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు ఆధారాలు సేకరించి ఆ నలుగురిని అరెస్టు చేశారు. దేవస్థానం హుండీలోని రూ. 82 వేలు ఆ నలుగురు కాజేసినట్లు పోలీసులు చార్జిషీట్ కూడా పేర్కొన్నారు. ఆళ్లగడ్డ జేఎఫ్‌సీఎం కోర్టులో సంబంధిత కేసు విచారణ జరుగుతుంది. వాస్తవాలు ఇలా ఉండగా ఈ చోరీ కేసును స్థానిక ఎమ్మెల్యే సెటిల్ చేసినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ, చోరీ చేసిన డబ్బులో సీఎం వాటా ఎంత అంటూ కొందరు కించపరిచే విధంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే విధంగా కొందరు టీవీ డిబేట్లలో కూడా చెబుతున్నారు. ఈ తప్పుడు ప్రచారంపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం" అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపింది.

# మతం మార్చాలని చూస్తే గుణపాఠం

**హిందువులకు విజయసాయిరెడ్డి పిలుపు**



విజయవాడ, డిసెంబర్ 7 (ఈవార్తలు): హిందూ మతంపై కుట్రలు జరుగుతున్నాయని, వాటిని సహించేది లేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డబ్బు ఆశ చూపించి మతమార్పిడులకు పాల్పడే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. గత రెండు దశాబ్దాలుగా జరిగిన మతమార్పిడులపై ప్రభుత్వం ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ జరపాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రలోభాలకు గురిచేసి మతాలను మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "డబ్బు ఆశ చూపి మతం మార్చాలని ప్రయత్నిస్తే, అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పిద్దాం" అని ఆయన స్పష్టం చేశారు. దేశం కోసం, ధర్మం కోసం హిందూ సమాజంలోని అన్ని వర్గాలు ఏకం కావాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఐక్యతే భారతదేశానికి అసలైన రక్ష అని, అదే శ్రీరామరక్ష అని ఆయన పేర్కొన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.

# 37 మంది ఎమ్మెల్యేలపై చంద్రబాబు గుర్రు



అమరావతి, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎమ్మెల్యేల పనితీరుపై ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంతో పోల్చుకుంటే ఎమ్మెల్యేల పనితీరు కాస్త మెరుగుపడింది అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సమీక్షలు, వన్ టు వన్ భేటీల ద్వారా దాదాపు అందరు ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడింది అని చెప్పుకొచ్చారు. అయితే 37మంది ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాల్సి ఉంది అని చెప్పుకొచ్చారు. ప్రతీ ఒక్క ఎమ్మెల్యే పనితీరుపై నాలుగైదు మార్గాలలో సర్వే చేయిస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరు, పాలన గురించి చాలా రకాలుగా సర్వేలు చేయిస్తున్నా. ఏదో ఒక్క సర్వే కాదు.. రకరకాల మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నా. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో రియల్ టైమ్‌లో తెలుసుకుంటున్నా. ఏ నాయకుడు ఏ విధంగా ప్రజలకు పనులు చేస్తున్నారో కూడా తెలుసుకుంటున్నా'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'మనం ఏం చేశామనే అంశంతో పాటు.. ప్రజలు, కార్యకర్తలతో ఎలా వ్యవహరిస్తారోననేది కూడా ముఖ్యం. కష్టపడి పని చేసే వారికి మంచి పదవులు దక్కుతాయి. ఏడాది ముందు ఎన్నికల కోసం పని చేస్తే ప్రజలు నమ్మరు. అందుకే మొదటి నుంచే పొరపాట్లు సరిదిద్దుకుని, పాలనలో లోటుపాట్లు ఉంటే సరి చేసుకుందాం. ప్రజలు, కార్యకర్తలకు నచ్చని విషయాలు ఉంటే సరి చేసుకుందాం'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. పార్టీ కోసం అంకితమై పనిచేసే వారిని గుర్తించేకుని పనియాల్సిన బాధ్యత మనపై ఉంది. వారసులైనా సరే.. పని చేస్తేనే వారికి పదవులు వస్తాయి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ప్రజల్లోకి నామోషీ లేకుండా వెళ్లి ప్రభుత్వం చేసిన పనుల్ని వివరించండి. చేసిన పనులు చెప్పడంతో పాటు.. అమలు కాని పనులు ఎందుకు అవ్వలేదో చెప్పాల్సిన బాధ్యత కూడా మనపై ఉంది. ప్రజలకు ఎంత అందుబాటులో ఉంటే వారు అంత ఆదరిస్తారు. పనిచేయడం ఒక ఎత్తు...జనానికి అందుబాటులో ఉండటం మరొకఎత్తు.'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఎన్నికల సమయంలో ప్రత్యర్థులు దౌర్జన్యాలు చేసినా ప్రజలు కూటమికి అండగా నిలబడ్డారు. నిర్మొహమాటకుండా వ్యవహరించి గెలుపే ధ్యేయంగా అభ్యర్థులను ఎంపిక చేశాం. సోషల్ రీ-ఇంజనీరింగ్ చేశాం. 2014లో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశాం. కానీ రాజకీయం మరిచిపోయాం. చేసింది చెప్పుకోలేకపోయాం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఎప్పటికప్పుడు చేసిన పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మనోభావాలకు అనుగుణంగా వ్యవహరించాలి.' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. '2014లో రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితులు చక్కదిద్దుకుంటూ ఎవరికీ ఇబ్బంది లేకుండా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా చేసి చూపించాం. కానీ చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలు చెప్పారు. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టించారు. కుట్రలు పన్నారు'అని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. '2019 ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న వివేకానందరెడ్డి హత్యే ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మనం చేస్తున్న మంచిని ఏ స్థాయిలో వివరిస్తున్నామో.. వారి కుట్రలను కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది.'అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# 500 కోట్లిస్తే సీఎం సీటు

**నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య సంచలన వ్యాఖ్యలు**

చండీగఢ్: పంజాబ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య, ఆ పార్టీ నాయకురాలు నవజ్యోత్ కౌర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ.500 కోట్లు ఇచ్చేవాడు సీఎం అవుతాడని తెలిపారు. తమ వద్ద డబ్బు లేదని, అయితే అవకాశం ఇస్తే పంజాబ్‌ను 'స్వర్ణ రాష్ట్రంగా' మార్చగలమని అన్నారు. శనివారం పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను నవజ్యోత్ కౌర్ కలిశారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు, ఇతర సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో నవజ్యోత్ కౌర్ మాట్లాడారు. పంజాబ్‌లో సీఎం అభ్యర్థిగా నవజ్యోత్ సింగ్ సిద్ధూను కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తే ఆయన తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారని తెలిపారు. 'మేం ఎల్లప్పుడూ పంజాబ్, పంజాబీల కోసం మాట్లాడతాం. కానీ సీఎం కుర్చీలో కూర్చోవడానికి మా వద్ద రూ.500 కోట్లు లేవు' అని అన్నారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేశారా? అని అడిగినప్పుడు, ఎవరూ డిమాండ్ చేయలేదని చెప్పారు. అయితే 'రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చిన వాడు ముఖ్యమంత్రి అవుతాడు' అని మరోసారి అన్నారు. కాగా, పంజాబ్‌ను మెరుగుపరచడానికి ఆ (సీఎం) అధికారాన్ని నవజ్యోత్ సింగ్ సిద్ధూకు ఇస్తే మంచి ఫలితాలు సాధిస్తారని, బంగారు రాష్ట్రంగా మారుస్తారని నవజ్యోత్ కౌర్ తెలిపారు. అయితే పంజాబ్ కాంగ్రెస్‌లో 'అంతర్గత కలహాలు' ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికే ఐదుగురు నాయకులు ముఖ్యమంత్రి పదవి ఆశిస్తున్నారని తెలిపారు. దీంతో సిద్ధూను వారు ముందుకు రానివ్వరని చెప్పారు. 'కాంగ్రెస్‌ను ఓడించాలని వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారు (హైకమాండ్) దీనిని అర్థం చేసుకుంటే, అది వేరే విషయం' అని ఆమె అన్నారు. మరోవైపు తన భర్త నవజ్యోత్ సింగ్ సిద్ధూకు కాంగ్రెస్‌తో, ఆ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రాతో బలమైన అనుబంధం ఉన్నదని నవజ్యోత్ కౌర్ తెలిపారు. తిరిగి బీజేపీలో ఆయన చేరుతారా? అని అడిగినప్పుడు ఆయన తరుపున ఆ విషయాన్ని తాను చెప్పలేనని అన్నారు. అయితే సిద్ధూను ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటిస్తే క్రియాశీల రాజకీయాల్లోకి తిరిగి వస్తారని తెలిపారు. 'లేకపోతే ఆయన మంచిగా డబ్బు సంపాదిస్తున్నారు. ఆయన సంతోషంగా ఉన్నారు' అని అన్నారు. కాగా, పంజాబ్ కాంగ్రెస్ మాజీ చీఫ్ అయిన సిద్ధూ చాలా కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఆయన ప్రచారం చేయలేదు.

# ఇండిగో సంక్షోభానికి సీఈవోనే కారణం

**పైలట్ల పేరుతో సోషల్ మీడియాలో లేఖ వైరల్**




న్యూఢిల్లీ: ఇండిగో సంక్షోభానికి ఆ సంస్థ సీఈవోనే కారణం అని పైలట్లు ఆరోపిస్తున్నట్లు ఒక లేఖ వైరల్ అవుతోంది. సీఈవో పీటర్ ఎల్బర్స్ సహా పలువురు ఉన్నతాధికారులు ఇండిగోను పతనం అంచుకు నెట్టారని ఆ లేఖలో ఆరోపించారు. ఇండిగో సంక్షోభం రాత్రికి రాత్రే తలెత్తలేదని.. అది సంవత్సరాలుగా జరుగుతోందని లేఖలో పేర్కొన్నారు. 2006లో ఇండిగో ప్రారంభం నుంచే మొదలైంది లేఖలో ప్రస్తావించారు. అనుభవం, అర్హతలను విస్మరించి, నైపుణ్యం, కార్యాచరణ అవగాహన లేని వ్యక్తులకు కీలక పదవులను అప్పగించడంతో ఎయిర్‌లైన్ పతనం ప్రారంభమైందని ఆరోపించారు. పైలట్లు, సిబ్బంది అలసట, భద్రత, నిబంధనలను విస్మరించారని లేఖలో పేర్కొన్నారు. అలసట, పని ఒత్తిడి డ్యూటీలను వ్యతిరేకించిన పైలట్లను కార్యాలయానికి పిలిచి మందలించడం, బెదిరింపులకు దిగడం, అవమానించినట్లు లేఖలో ప్రస్తావించారు. అదనంగా జీతం చెల్లించకుండా డ్యూటీలు, షిఫ్ట్‌లు, పెరిగిన పనిభారం మోపారని.. సిబ్బంది ఉద్యోగాల్లో సంతోషంగా ఉండాలని కానీ.. కాలక్రమేణా విమానయాన సంస్థలో విషపూరితమైన పని సంస్కృతి అభివృద్ధి చెందిందని లేఖలో ఆరోపించారు. ఉద్యోగుల్లో పెరుగుతున్న అసంతృప్తిని సంవత్సరాలుగా విస్మరించారని.. ఆ ప్రభావం ప్రస్తుతం కార్యాచరణ సంక్షోభం రూపంలో వ్యక్తమవుతుందన్నారు. లేఖలో ఎనిమిది మంది ఉన్నతాధికారులు ప్రస్తుత సంక్షోభానికి బాధ్యులుగా పేర్కొన్నారు. లేఖలో మొదట పేరు సీఈవో పీటర్ ఎల్బర్స్ పేరు ఉంది. ఈ సంక్షోభ సమయంలో ఆయన సెలవులో ఉన్నాడని.. స్వస్థలం నెదర్లాండ్స్‌కు వెళ్లినట్లుగా ఆరోపించారు. ఈ సంక్షోభానికి జాసన్ హెర్టర్, అదితి కుమారి, తపస్ డే, రాహుల్ పాటిల్, సీవోవో పోర్కెరాస్, అసిమ్ మిత్రా (ఫ్లైట్ ఆపరేషన్స్ ఎస్‌వీపీ), అక్షయ్ మోహన్ ఉన్నారు. ఈ ఎగ్జిక్యూటివ్‌ల నిర్ణయాల కారణంగా గతవారం రోజులుగా ఇండిగో కార్యాచరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లుగా లేఖ ఆరోపించింది. పైలట్ల పేరుతో రాసిన లేఖ వైరల్‌గా మారింది.

# మూడేళ్లుగా కరెంటు బిల్లు కట్టని తేజ్ ప్రతాప్



పాట్నా: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్‌కు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ మొత్తం రూ.3.6 లక్షలు దాటినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే, పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జులైలో కరెంటు బిల్లు చెల్లించారు. గత మూడేళ్లుగా దీనికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి ఇప్పుడా మొత్తం కరెంటు బిల్లు రూ.3,61,000కు చేరింది. ఇక తేజ్‌ప్రతాప్ పేరు మీద మరో కరెంట్ కనెక్షన్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ డేటా వెల్లడిస్తోంది. దీనికి సంబంధించిన బకాయిలు కూడా జరిమానాలతో కలిపి రూ.3,24,974 చెల్లించాల్సి ఉంది. ఈ వ్యవహారం కాస్త రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది. బకాయిలు పేరుకుపోకుండా ఉండేందుకు బీహార్ ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ.. తేజ్ ప్రతాప్ తన నివాసానికి పోస్ట్‌పెయిడ్ మీటర్‌నే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం.. రూ.25వేల కంటే ఎక్కువ బిల్లు ఉంటే ఏ పోస్టుపెయిడ్ కనెక్షన్ అయినా డీయాక్టివ్ చేయాలి. అలాంటిది.. తేజ్‌ప్రతాప్ పేరు మీద ఉన్న విద్యుత్తు కనెక్షన్‌ల బకాయిలు రూ.3లక్షలు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడీ వ్యవహారం కాస్త చర్చనీయాంశంగా మారింది. ఇక బకాయి చెల్లింపులకు సంబంధించి చర్యలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

# ఏయూ

**కోర్టు ధిక్కారం కింద శిక్ష**



అమరావతి, డిసెంబర్ 7 (ఈవార్తలు): ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ) మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డికి హైకోర్టులో బిగ్ షాక్ తగిలింది. నూకన్న దొరను వృక్షశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగించాలని ఆదేశించిన ఆదేశాలను ప్రసాదరెడ్డి ఉద్దేశపూర్వకంగా పాటించలేదని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ధిక్కార నేరానికి పాల్పడినట్లు నిర్ధారించిన హైకోర్టు... ఆయనకు నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. ప్రసాదరెడ్డి తరపు న్యాయవాది అభ్యర్థన మేరకు తీర్పు అమలును ఈనెల 22వ తేదీ వరకు సస్పెండ్ చేసింది. వివరాలు... ఆంధ్ర యూనివర్సిటీ సైన్స్, టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో బోధనా సిబ్బందిగా నూకన్నదొర 2006 జులైలో నియమితులయ్యారు. తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్(ఒప్పంద)గా కొనసాగారు. ఇలా ఏయూలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌గా 17ఏళ్ల పాటు సేవలందించారు. అయితే నూకన్నదొరను విధుల నుంచి తొలగిస్తూ 2022 నవంబరు 18న అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ నూకన్న 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2022 మే నుంచి జీతం చెల్లించలేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే నూకన్న దొరను కొనసాగించాలని 2023 మార్చిలో హైకోర్టు, నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అప్పటి వీసీ ప్రసాదరెడ్డిపై నూకన్నదొర హైకోర్టులో కోర్టుధిక్కరణ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఏపీ హైకోర్టు...కోర్టు ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయడం అధికారుల విధి. వాటికి వక్రభాష్యం చెప్పడానికి వీల్లేదని స్పష్టం చేసింది. న్యాయపరమైన ఆదేశాలను అక్షరాలా పాటించాలని, అధికారులు వాటిని ఇష్టానుసారంగా తిరిగి అర్థం చేసుకోలేరని తెలిపింది. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఏకైక పరిష్కారం అప్పీల్ చేయడం అని... ధిక్కరణ కాదని కూడా హైకోర్టు పునరుద్ఘాటించింది.

## నా హోటల్ రూంలో ఆత్మ: కృతి శెట్టి



చెన్నై: యువ కథానాయిక కృతి శెట్టి తనకు ఎదురైన ఓ వింత అనుభవాన్ని పంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి సరిగ్గా ముందు రోజు రాత్రి, తన హోటల్ గదిలో ఒక ఆత్మను చూశానని ఆమె వెల్లడించారు. తమిళ నటుడు కార్తి హీరోగా, నలన్ కుమారస్వామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వా వాత్తియార్' చిత్రంలో కృతి శెట్టి నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె ఆత్మలతో మాట్లాడే ఒక జిప్సీ యువతి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర గురించి మాట్లాడుతూ, "ఈ సినిమా షూటింగ్ మొదలవడానికి ముందు రోజు రాత్రి నాకో వింత అనుభవం ఎదురైంది. మా అమ్మతో కలిసి హోటల్ గదిలో ఉన్నప్పుడు ఒక ఆత్మ రూపాన్ని చూశాను. మేం లైట్ వేయగానే పెద్ద శబ్దం వచ్చి అది మాయమైంది. ఆ ఆత్మ నాకు సహాయం చేయడానికి వచ్చిందో లేక పాత్ర కోసం నేను చేస్తున్న సాధన వల్ల వచ్చిందో తెలియదు" అని కృతి తెలిపారు. తనకు మొదటి నుంచి ఆత్మలపై నమ్మకం ఉందని ఆమె పేర్కొన్నారు. "నేను తుళు సంప్రదాయానికి చెందినదాన్ని. మేము మా పూర్వీకులను దేవతలుగా పూజిస్తాం. వారు ఎప్పుడూ మమ్మల్ని కాపాడుతూ ఉంటారని నమ్ముతాం. ఇప్పుడు ఈ ఘటనతో ఆ నమ్మకం మరింత బలపడింది" అని వివరించారు. ఈ అనుభవం వల్ల సినిమాలో తాను పోషిస్తున్న పాత్రపై మరింత నమ్మకం కలిగిందని, నటనలో అది తనకు బాగా ఉపయోగపడిందని కృతి శెట్టి అన్నారు.

## మా పేరుతో మోసాలు.. నమ్మొద్దు: మైత్రీ మూవీ మేకర్స్

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తమ సంస్థ పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసింది. కొందరు వ్యక్తులు, ఏజెన్సీలు తమ సినిమాలలో అవకాశాలు ఇప్పిస్తామంటూ నకిలీ క్యాస్టింగ్ కాల్స్ నిర్వహిస్తున్నారని, వాటిని నమ్మవద్దని స్పష్టం చేసింది. తమ సంస్థకు సంబంధించిన ఏ ప్రకటన అయినా తమ అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా మాత్రమే వెలువడుతుందని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో తమ నిర్మాతలలో ఒకరైన నవీన్ యెర్నేని పేరు మీద ఒక నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తమ దృష్టికి వచ్చిందని మైత్రీ మూవీ మేకర్స్ యాజమాన్యం పేర్కొంది. అది పూర్తిగా ఫేక్ అకౌంట్ అని, దానిని ఎవరూ అనుసరించవద్దని కోరింది. ఇలాంటి మోసపూరిత ప్రలోభాలకు గురికావద్దని, డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆసక్తి ఉన్న నటీనటులకు, ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఎవరైనా మైత్రీ మూవీ మేకర్స్ పేరుతో సంప్రదించినా లేదా సోషల్ మీడియాలో అనుమానాస్పద ప్రొఫైల్స్ కనిపించినా, వాటిని వెంటనే రిపోర్ట్ చేయాలని సూచించింది. అధికారిక సమాచారం కోసం కేవలం తమ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను మాత్రమే అనుసరించాలని స్పష్టం చేసింది.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి ఫస్ట్ సింగిల్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాలోని మొదటి పాట ప్రోమోను డిసెంబర్ 9న సాయంత్రం 6:30 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. "మీరు ప్రేమించిన, ఈలలు వేసిన పవర్ స్టార్ ఇప్పుడు మరింత శక్తి, సరికొత్త యాటిట్యూడ్‌తో రాబోతున్నారు" అంటూ చిత్ర యూనిట్ ఈ పాటపై అంచనాలను పెంచింది. ఈ పాటను ప్రముఖ బాలీవుడ్ సింగర్ విశాల్ దద్లానీ ఆలపించగా, భాస్కరభట్ల సాహిత్యం అందించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజా ప్రకటనతో పవర్ స్టార్ అభిమానుల్లో పండగ వాతావరణం నెలకొంది.

## ట్రూడోతో పెర్రీ లవ్ ఎఫైర్

న్యూయార్క్: అమెరికాకు చెందిన పాప్ సింగర్ కేటీ పెర్రీ, కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో మధ్య ప్రేమాయణంపై వస్తున్న ఊహాగానాలకు తెరపడింది. తమ రిలేషన్‌షిప్‌ను కేటీ పెర్రీ అధికారికంగా ప్రకటించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జస్టిన్ ట్రూడోతో కలిసి ఉన్న పలు ఫోటోలను షేర్ చేశారు. తమ ప్రేమ బంధాన్ని ప్రపంచానికి తెలియజేశారు. ఇటీవల జపాన్‌లో పర్యటించిన ఈ జంట అక్కడ ఫొటోలు దిగింది. ఆ ఫోటోలను పెర్రీ పంచుకుంది. ఒక ఫొటోలో ఇద్దరూ చాలా సన్నిహితంగా ఒకరినొకరు హత్తుకుని సెల్ఫీ తీసుకున్నారు. మరొక వీడియోలో ఇద్దరూ కలిసి భోజనం చేస్తున్న దృశ్యాలు ఉన్నాయి. పెర్రీ పోస్ట్‌కు 'టోక్యో టైమ్స్ ఆన్ టూర్ అండ్ మోర్' అని కేటీ పెర్రీ క్యాప్షన్ ఇచ్చారు. ఈ పరిణామం జరగడానికి కొద్ది రోజుల ముందే జస్టిన్ ట్రూడో, కేటీ పెర్రీతో కలిసి జపాన్ మాజీ ప్రధాని ఫుమియో కిషిదా, ఆయన భార్య యూకోను కలిశారు. ఈ భేటీ తర్వాత కిషిదా ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. అందులో కేటీ పెర్రీని ట్రూడో భాగస్వామి అని సంబోధించారు. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో తన భాగస్వామితో కలిసి జపాన్ వచ్చారని పేర్కొన్నారు. తామిద్దరం కలిసి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి కృషి చేశామని, ఆ స్నేహం ఇలా కొనసాగుతుండటం సంతోషంగా ఉందని కిషిదా పేర్కొన్నారు.

## మైనర్‌పై రేప్.. భారతీయుడికి ఏడేళ్ల జైలు

ఆక్లాండ్: న్యూజిలాండ్‌లో భారత సంతతి కి చెందిన సత్వీందర్ సింగ్ అనే క్యాబ్ డ్రైవర్‌కి ఏడేళ్లు జైలు శిక్ష పడింది. ఇతడు 2023లో ఓ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు రుజువు కావడంతో అధికారులు జైలుశిక్ష విధించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సత్వీందర్ సింగ్ అనే క్యాబ్ డ్రైవర్ గత 11 ఏళ్లుగా న్యూజిలాండ్‌లో ఉంటూ క్యాబ్ నడుపుతున్నాడు. 2023లో ఒక రోజు రాత్రి మైనర్ ప్రయాణికురాలు క్యాబ్‌ను బుక్ చేసుకుంది. ఈ క్రమంలో సత్వీందర్ సింగ్ జీపీఎస్‌ను ఆఫ్ చేసి.. కారును మార్గం మళ్లించాడు. అక్కడ మైనర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బాధితురాలిని ఆమె స్నేహితుల ఇంటి దగ్గర వదిలేశాడు. సీసీ కెమరాల ఆధారంగా సత్వీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## విజయ్ రోడ్ షోకు నో పర్మిషన్

చెన్నై: టీవీకే (తమిళగ వెట్రి కజగం) అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడు పోలీసులు షాకిచ్చారు. టీవీకే రోడ్ షోకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నెల 16న ఈరోడ్‌లో విజయ్ రోడ్ షోకు టీవీకే సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో రోడ్ షోకు 75 వేల మంది వరకు వస్తారని పోలీసులు అంచనా వేసినట్టు సమాచారం. ఈ మేరకు తొక్కిసలాట జరిగే ప్రమాదముందని భావిస్తున్న పోలీసులు కార్నర్ మీటింగ్‌కు అనుమతిని నిరాకరించారు. మరోవైపు ఫంక్షన్ హాల్‌లో సమావేశానికి కూడా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. మరి విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తి నెలకొంది. విజయ్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.



**దేశీయ విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు తీవ్ర గందరగోళంలో పడ్డాయి. పెద్ద ఎత్తున విమానాలు ఆలస్యం కావడం, కొన్ని సర్వీసులు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సంక్షోభంపై తక్షణమే స్పందించిన ఇండిగో యాజమాన్యం, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఒక ఉన్నత స్థాయి 'సంక్షోభ నిర్వహణ బృందాన్ని' ఏర్పాటు చేసింది.**

# రంగంలోకి ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్

**పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు.. సంక్షోభ నిర్వహణ బృందంలో ఛైర్మన్, సీఈవో, కీలక డైరెక్టర్లు**

న్యూఢిల్లీ: ఆదివారం జరిగిన ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత సంక్షోభం, దాని తీవ్రతపై యాజమాన్య బృందం బోర్డు సభ్యులకు సమగ్రంగా వివరించింది. అనంతరం బోర్డు సభ్యులు ప్రత్యేకంగా సమావేశమై, వేగంగా మారుతున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఈ ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా, బోర్డు డైరెక్టర్లు గ్రెగ్ సరెట్స్కీ, మైక్ విటేకర్, అమితాబ్ కాంత్, సీఈఓ పీటర్ ఎల్బర్స్ సభ్యులుగా ఉన్నారు. కార్యకలాపాలను తిరిగి గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై యాజమాన్యం నుంచి ఈ బృందం ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తోందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, సర్వీసులను సాధారణ స్థితికి తీసుకురావడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొంది. ఇబ్బందులు పడిన ప్రయాణికులకు




అన్ని విధాలా అండగా ఉంటామని ఇండిగో హామీ ఇచ్చింది. విమానాలు రద్దయిన వారికి పూర్తి రిఫండ్ ఇవ్వడంతో పాటు, ప్రయాణ తేదీ మార్పు, రద్దు ఛార్జీల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. సాధ్యమైనంత త్వరగా కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొస్తామని ఇండిగో ప్రతినిధి తెలిపారు.

### పదో తేదీనాటికి పరిస్థితి కొలిక్కి: ఇండిగో

ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. తన కార్యకలాపాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకొస్తోంది. తమ సేవల్లో స్థిరమైన, బలమైన మెరుగుదల కనిపిస్తోందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్యకలాపాలను పునరుద్ధరించే పనుల్లో వేగం పెంచామని, పరిస్థితిని చక్కదిద్దుతున్నామని పేర్కొంది. శనివారం సుమారు 1,500 విమానాలు నడపగా, ఆదివారం ఆ సంఖ్యను 1,650కి పైగా పెంచినట్లు ఇండిగో వెల్లడించింది. కేవలం 30 శాతంగా ఉన్న విమానాల సమయపాలన ఒక్కరోజులోనే 75 శాతానికి మెరుగుపడిందని వివరించింది. గత రెండు రోజులుగా తమ నెట్‌వర్క్‌ను స్థిరీకరించేందుకు పలు కీలక చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. విమానాల రద్దు సమాచారాన్ని ప్రయాణికులకు ముందుగానే అందిస్తున్నామని, దీనివల్ల వారి ఇబ్బందులు తగ్గుతున్నాయని పేర్కొంది. రిఫండ్‌లు, బ్యాగేజీ సంబంధిత ప్రక్రియలు కూడా పూర్తి సామర్థ్యంతో సజావుగా సాగుతున్నాయని స్పష్టం చేసింది. తొలుత అంచనా వేసిన దానికంటే ముందుగానే, అంటే డిసెంబర్ 10 నాటికే కార్యకలాపాలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేసింది.

## 610 కోట్ల రిఫండ్ చెల్లింపు

విమానాలకు సంబంధించి ప్రయాణికులకు చెల్లించాల్సిన రిఫండ్‌లను ఆదివారం రాత్రి 8 గంటలలోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాల మేరకు ఇండిగో ఆదివారం రాత్రి నాటికి సుమారు రూ. 610 కోట్లను ప్రయాణికులకు రిఫండ్ చేసినట్లు మంత్రిత్వ శాఖ




ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. విమానాల రద్దు కారణంగా తమ ప్రయాణాలను రీషెడ్యూల్ చేసుకునే వారి నుంచి ఎలాంటి అదనపు రుసుములు వసూలు చేయరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రయాణికులకు తక్షణమే సహాయం అందించేందుకు, రిఫండ్, రీబుకింగ్ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించేందుకు ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి అందజేయాలని ఆదేశించగా, శనివారం నాటికి 3,000 బ్యాగులను ఇండిగో డెలివరీ చేసింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ప్రధాన విమానాశ్రయాల్లో పరిస్థితులు సాధారణంగా ఉన్నాయని, కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్లు ధృవీకరించారు.

## ఇండిగోకు డీజీసీఏ నోటీసు

ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తూ భారీ సంఖ్యలో విమానాలను రద్దు చేస్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు నోటీసులు జారీ చేసిన ఒక రోజు వ్యవధిలోనే, తాజాగా ఆదివారం ఇండిగో అకౌంటబుల్ మేనేజర్‌కు కూడా షోకాజ్ నోటీసు ఇచ్చింది. విమాన సిబ్బంది పనివేళలు, విశ్రాంతి సమయాలను నియంత్రించే కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలను సజావుగా అమలు చేయడానికి సరైన ఏర్పాట్లు చేయడంలో ఇండిగో విఫలమైందని డీజీసీఏ తన నోటీసులో స్పష్టం చేసింది. ప్రణాళిక, పర్యవేక్షణ, వనరుల నిర్వహణలో తీవ్రమైన లోపాల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొంది. ఈ వైఫల్యం వల్ల ఇండిగో సంస్థ ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్, 1937లోని రూల్ 42ఏతో పాటు సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ లోని పలు నిబంధనలను ఉల్లంఘించినట్లు డీజీసీఏ గుర్తించింది. విమానాలు రద్దయినప్పుడు ప్రయాణికులకు నిబంధనల ప్రకారం అవసరమైన సహాయం, సౌకర్యాలు కల్పించడంలో కూడా విఫలమైందని తెలిపింది. ఈ ఉల్లంఘనలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని అకౌంటబుల్ మేనేజర్‌ను డీజీసీఏ ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మరోవైపు, తాము రోజుకు 1,500 విమానాలు నడుపుతున్నామని, 95 శాతం నెట్‌వర్క్‌ను పునరుద్ధరించామని ఇండిగో ప్రకటించింది. అయినప్పటికీ, ఆదివారం కూడా దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో విమానాలు రద్దవడంతో ప్రయాణికుల కష్టాలు కొనసాగుతున్నాయి.




# ఏ నిధులూ సేకరించట్లే

**ఆ వార్తలన్నీ అబద్ధం**

**ఎలాన్ మస్క్ క్లారిటీ**



న్యూయార్క్: టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ తన అంతరిక్ష సంస్థపై వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు. స్పేస్‌ఎక్స్ 800 బిలియన్ డాలర్ల విలువతో నిధులు సమీకరిస్తోందని, అలాగే నాసా నుంచి సబ్సిడీలు పొందుతోందని వచ్చిన కథనాల్లో ఏమాత్రం నిజం లేదని ఆదివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో వరుస పోస్టులు చేశారు. స్పేస్‌ఎక్స్ 800 బిలియన్ డాలర్ల భారీ విలువతో సెకండరీ షేర్ల అమ్మకానికి సిద్ధమవుతోందని ఇటీవల 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తలపై మస్క్ స్పందిస్తూ, "స్పేస్‌ఎక్స్ 800 బిలియన్ డాలర్ల నిధులు సమీకరిస్తోందని మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇది నిజం కాదు. మా కంపెనీ చాలా ఏళ్లుగా లాభాల్లో ఉంది. ఉద్యోగులు, ఇన్వెస్టర్లకు నగదు లభ్యత కల్పించేందుకు ఏడాదికి రెండుసార్లు స్టాక్ బైబ్యాక్ చేస్తుంటాం" అని స్పష్టం చేశారు. నాసా సబ్సిడీల అంశాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. "వచ్చే ఏడాది మా ఆదాయంలో నాసా వాటా 5 శాతం కన్నా తక్కువే ఉంటుంది. మాకు నాసా సబ్సిడీలు ఇస్తోందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. అత్యుత్తమ ఉత్పత్తిని, అతి తక్కువ ధరకు అందించడం వల్లే మేము నాసా కాంట్రాక్టులు గెలుచుకున్నాం. వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే విషయంలో నాసా భద్రతా ప్రమాణాలను అందుకున్న ఏకైక సంస్థ ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ మాత్రమే" అని మస్క్ అన్నారు. స్టార్‌షిప్, స్టార్‌లింక్ ప్రాజెక్టులలో సాధిస్తున్న పురోగతి ఆధారంగానే కంపెనీ విలువ పెరుగుతుందని ఆయన తెలిపారు. కాగా, స్పేస్‌ఎక్స్ గత వారం కాలిఫోర్నియా నుంచి 28 స్టార్‌లింక్ శాటిలైట్లను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ ఏడాది ఫాల్కన్ 9 రాకెట్‌తో ఇది 156వ ప్రయోగం కావడం విశేషం.



## ఐపీఎల్ మ్యాచ్‌ల తరలింపును అనుమతించం: డీకే

బెంగళూరు: ఐపీఎల్ మ్యాచ్‌లను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం నుంచి తరలించే ప్రసక్తే లేదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇది బెంగళూరు, కర్ణాటక ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని ఆయన అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను కూడా క్రికెట్ అభిమానినే. చిన్నస్వామి స్టేడియం నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలించడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం. స్టేడియం ప్రతిష్ఠను కాపాడతాం" అని డీకే శివకుమార్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా, బెంగళూరులో ప్రత్యామ్నాయంగా మరో కొత్త క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. కిందటి సీజన్ లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు టైటిల్ గెలిచిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవాలు తీవ్ర విషాదం నింపిన సంగతి తెలిసిందే. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు. 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో, 2026 సీజన్ లో ఐపీఎల్ మ్యాచ్ లు చిన్నస్వామి స్టేడియంలో జరగకపోవచ్చు అని వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మరోవైపు, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో యాజమాన్యం మారితే, జట్టు హోం గ్రౌండ్‌పై ఏమైనా ప్రభావం పడుతుందేమోనన్న ఊహాగానాలు కూడా మొదలయ్యాయి.

## క్లబ్ ఘటనపై గతంలోనే నోటీసులు



పనాజీ: గోవాలోని 'బర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 25 మంది సజీవ సమాధి అయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం భారీగా జరగడానికి కారణం క్లబ్ పరిసరాలేనని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. క్లబ్ లోకి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండడంతో పాటు అలంకరణ కోసం క్లబ్ ముందు ఏర్పాటు చేసిన తాటాకుల వల్ల మంటలు వేగంగా విస్తరించాయని చెబుతున్నారు. క్లబ్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. గతంలో క్లబ్ ను పరిశీలించిన అధికారులు.. పరిసరాలను గమనించి ఆ ఏరియాలో క్లబ్ నిర్వహణకు అనుకూలం కాదని, వెంటనే క్లబ్ ను మూసేయాలని నోటీసులు కూడా జారీ చేశారని సమాచారం. అయితే, ఈ నోటీసులను లెక్కచేయకుండా క్లబ్ ను నడపడం వల్ల తాజాగా జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సహాయక సిబ్బంది అక్కడికి చేరుకున్నప్పటికీ ఇరుకైన మార్గాల కారణంగా మంటలు ఆర్పడంలో ఆలస్యం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### అర్ధరాత్రి తర్వాత భారీ శబ్దం

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. శనివారం క్లబ్ కోలాహలంగా ఉంది. అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1 గంట ప్రాంతంలో డ్యాన్స్ ఫ్లోర్ పై వంద మందికి పైగా డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. ఆపై మంటలు ఎగిసిపడడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. జనం భయాందోళనతో పరుగులు తీశారు. ఇంతలోనే మంటలు క్లబ్ అంతటా వ్యాపించాయి. పొగ కారణంగా బయటకు వెళ్లే మార్గం కనిపించక చాలామంది మరణించారు. అగ్నిప్రమాదం నేపథ్యంలో క్లబ్ నిర్వాహకులపై చర్యలు చేపట్టినట్లు గోవా సీఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. ఇప్పటికే మేనేజర్‌ను అరెస్టు చేయగా.. క్లబ్ యజమానులపై అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## మళ్లీ బద్దలైన కిలవేయ అగ్నిపర్వతం

**వెయ్యడుగుల ఎత్తుకు లావా**

హవాయ్: అగ్రరాజ్యం అమెరికాకు చెందిన హవాయి ద్వీపంలో అత్యంత క్రియాశీల అగ్నిపర్వతాల్లో ఒకటైన కిలవేయ మరోసారి విస్ఫోటనం చెందింది. అగ్నిపర్వతం నుంచి పెద్ద ఎత్తున లావా ఉబికివస్తోంది. వెయ్యి అడుగుల ఎత్తు వరకు ఎగసిపడుతోంది. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం అగ్నిపర్వతం బద్దలైనట్టు అధికారులు తెలిపారు. హవాయి జాతీయ ఉద్యానవనం లోపల ఉన్న కాల్డెరాలోనే లావా నిలిచిపోయిందని స్పష్టంచేశారు. అయినప్పటికీ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు కిలవేయ అగ్నిపర్వతం 38 సార్లు విస్ఫోటనం చెందింది.



వయ్యారి చిత్రం

జారా యాస్మిన్



## తెలంగాణ కింగ్.. విజయ్ దేవరకొండ!?

ఆంధ్రా కింగ్ తాలూకాగా రామ్ సినిమా రావడంతో, మరి తెలంగాణ కింగ్ ఎవరా? అన్న చర్చ మొదలైంది. ఈ టైటిల్‌తో సినిమా వస్తే ఏ హీరో పక్కాగా సూట్ అవుతాడని జోరుగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టైటిల్‌కి అర్హుడు విజయ్ దేవరకొండ అని అంటున్నారు. విజయ్ తెలంగాణ వాసే. పక్కా తెలంగాణ స్లాంగ్ మాట్లాడుతాడు. విజయ్‌కి ఈ యాస బాగా కలిసొచ్చింది. తాను స్టార్‌గా కనెక్ట్ అవ్వడానికి ఆ స్లాంగ్ ప్రధాన కారణం. పెళ్లి చూపులు సినిమాకు కంటెంట్‌తో పాటు విజయ్ స్లాంగ్ వర్కౌట్ అయింది. అందుకే ఆ సినిమా అంత పెద్ద హిట్ అయింది. అర్జున్ రెడ్డి, గీతగోవిందం లాంటి విజయాలతో సూపర్ స్టార్ అయ్యాడు. విజయ్ తర్వాత తెలంగాణ నుంచి ఆ స్థాయిలో సక్సెస్ అయిన మరో నటుడు కూడా లేడు. తెలంగాణ నుంచి హీరో నితిన్ ఉన్నా వరుస ఫ్లాపులతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ నేపథ్యంలో తెలంగాణ కింగ్ నే టైటిల్ విజయ్‌కి పర్ఫెక్ట్‌గా సూటవుతుందంటున్నారు.

## ప్రశాంత్ నీల్‌తో అఖిల్ మూవీ!?

అక్కినేని అఖిల్‌కు ఇప్పటిదాకా చెప్పుకోదగ్గ పెద్ద హిట్ దక్కలేదు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఏజెంట్ చిత్రానికి ఎంతో కష్టపడినా అనుకున్న ఫలితం రాలేదు. దీంతో చాలా గ్యాప్ తీసుకుని ప్రస్తుతం 'లెనిన్'గా ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు. మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నారు. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్. ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ చిత్రం తర్వాత అఖిల్.. పాన్ ఇండియా డైరెక్టర్ అయిన ప్రశాంత్ నీల్‌తో సినిమా చేయబోతున్నాడనే వార్త ఇండస్ట్రీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల ప్రశాంత్ నీల్‌తో అఖిల్ సమావేశం కావడంతో ఈ న్యూస్ వైరల్ అవుతోంది. ఇందులో ఎంతవరకు నిజముందో తెలియాలంటే చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడాల్సి ఉంది.








## తరుణ్, ఈషా తగ్ వార్

ఓం శాంతి శాంతి శాంతిః సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు డైరెక్టర్ తరుణ్ భాస్కర్. ఈ సినిమా ఆగస్టు 1న విడుదల కావాల్సి ఉండగా పలు కారణాల వల్ల వాయిదా పడింది. ఇక ఇటీవల షూట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నుంచి మూవీ మేకర్స్ వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తున్నారు. తాజాగా, 'ఓం శాంతి శాంతి శాంతి' నుంచి డబుల్ అప్డేట్స్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ డిసెంబర్ 8న విడుదల కానుందని తెలిపారు. అలాగే 'ఓం శాంతి శాంతి శాంతి' వచ్చే ఏడాది జనవరి 23న థియేటర్స్‌లో విడుదల కాబోతున్నట్లు పోస్టర్ ద్వారా ఫైనల్ చేశారు. 'మా గోదారొళ్ళకి ఎటకారం, మమకారం తో పాటు పట్టుదల కూడా కూసంత ఎక్కువే...ఆయ్' క్యాప్షన్ జత చేస్తూ.. తరుణ్, ఈషా మధ్య తగ్ వార్ జరగబోతున్నట్లుగా ఉన్న పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో భార్యభర్తలుగా కనిపించగా.. పెళ్లి బట్టల్లోనే ఇరు కుటుంబాలు ఓ తాడును పోటాపోటీగా లాగుతూ కనిపించి ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది.

## 'శశిరేఖ' ప్యూర్ క్లాసీ!

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి రెండో పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. 'శశిరేఖ' పేరుతో వచ్చిన ఈ పాట ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సింగర్ మధుప్రియతో కలిసి మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ పాడారు. ఇప్పటికే విడుదలైన మొదటి పాట అయిన 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట విడుదల చేయడం.. ఇది కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడం చిత్రబృందంలో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార హీరోయిన్. 2026 సంక్రాంతికి విడుదల కానుంది.



## ఆ తప్పు వెంటాడుతోంది


సినీ కెరియర్లో తాను చేసిన తప్పులు, పొరపాట్ల గురించి చెబుతూ నయనతార ఆశ్చర్యపరిచింది. ఇంటర్వ్యూలో భాగంగా తన కెరియర్ గురించి మాట్లాడుతూ.. 'నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి నటించాను. ఆ హీరోలతో నటించేటప్పుడు చిన్న చిన్న పొరపాట్లు కూడా చేస్తూ వచ్చాను. అందులో నటన గురించి మెలకువలు నేర్చుకోవడంలో చేసిన పొరపాట్లు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను. ఒకసారి ఒక సినిమా షూటింగ్లో మోహన్ లాల్ గారితో నటించినప్పుడు నా పాత్రకు చాలా డైలాగులు ఉండేవి. అయితే ఆ డైలాగులకు తగ్గట్టుగా హావాభావాలను పలికించేందుకు తెగ కష్టపడి పోయాను. మోహన్ లాల్ బాగా హావభావాలు పలకాలి అని నాతో చెప్పారు. ఇక పదేపదే చెబుతూ ఉంటే ఏం చేయాలో అర్థం కాక తెగ కంగారు పడిపోయాను. అయితే నా పరిస్థితిని అర్థం చేసుకున్న డైరెక్టర్ అక్కడికి వచ్చి ఈ రోజుకు చాలు.. రేపు ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం అని చెప్పి నన్ను రక్షించారు. ఇంటికి వెళ్ళాక కూడా మరునాడు చేయబోయే సీన్ల కోసం రాత్రంతా రిహార్సల్స్ చేశాను. మరుసటి రోజు షూటింగ్ సెట్లో అందరూ అనుకున్నట్టుగానే నటించాను. షాట్ చాలా బాగా వచ్చింది. ఇక నన్ను అందరూ మెచ్చుకున్నారు' అని తెలిపింది.





## ఏప్రిల్‌లో ఉస్తాద్ రిలీజ్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీశ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో నటిస్తున్నాడు. ఈ మూవీలో పోలీస్ ఆఫీసర్ గా పవన్ కళ్యాణ్ కనిపించనుండగా, శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్‌గా మెరుస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గబ్బర్ సింగ్ రేంజ్ లో ఈ సినిమా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 2026 లో రిలీజ్ కానుంది అట.



## బ్యూటీ విత్ బ్యాడ్ లక్..

బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ లో ఛాన్స్ ల కోసం ప్రయత్నాలు చేస్తున్నా ఇక్కడ ఆమెను అసలు పట్టించుకోవట్లేదు. ఐతే కోలీవుడ్ లో కాస్త పర్వాలేదు అన్నట్టు పరిస్థితి మొన్నటి దాకా కనిపించగా ఇప్పుడు అక్కడ కూడా అమ్మడికి బ్యాడ్ లక్ మొదలైంది. తమిళ్ లో సూర్యతో రెట్రో చేసిన పూజా హెగ్డే ప్రస్తుతం దళపతి విజయ్ చివరి సినిమా జన నాయగన్ లో నటిస్తుంది. ఈ సినిమాతో పాటు లారెన్స్ చేస్తున్న కాంచన 4లో ఆమె ఛాన్స్ అందుకుంది. ఐతే ధనుష్ నెక్స్ట్ సినిమాలో కూడా పూజా హెగ్డే అవకాశం అందుకుందని టాక్. ధనుష్ తో రాజ్ కుమార్ పెరియసామి చేయబోతున్న సినిమాలో ముందు పూజా హెగ్డేనే హీరోయిన్ గా అనుకున్నారట. ఐతే ఏమైందో ఏమో కానీ ఇప్పుడు ఆమె ప్లేస్ లో సాయి పల్లవినే ఫైనల్ చేశారని తెలుస్తుంది. ముందు సినిమాలో సాయి పల్లవినే తీసుకోవాలని అనుకోగా ఆమె బాలీవుడ్ రామాయణ్ లో నటిస్తుంది కాబట్టి డేట్స్ అడ్జస్ట్ అవుతాయా లేదా అన్న డౌట్ ఉండేదట.

## డ్రాగన్‌లో కాజోల్ స్పెషల్ రోల్!



ప్రశాంత నీల్ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న సినిమా.. డ్రాగన్. దాదాపు రూ.360 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా రానుంది. మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. కొత్త షెడ్యూల్ మరో వారంలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ సినిమా నుంచి ఓ బిగ్ అప్డేట్ వైరల్ గా మారింది. ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ కాజోల్ స్పెషల్ రోల్ చేయబోతున్నారట. ఈ మేరకు ప్రశాంత్ నీల్ తాజాగా ఆమెతో చర్చలు కూడా చేశారట. అయితే ఆమెది నెగిటివ్ రోల్ అని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతున్నట్లు సమాచారం.



## ఇంగ్లండ్‌కు స్టార్క్ చుక్కలు

### రెండో మ్యాచ్‌లో ఆసీస్ గ్రాండ్ విక్టరీ

### 2-0తో లీడ్‌లో కంగారులు

యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు ఆధిపత్యం కొనసాగుతోంది. 5 మ్యాచ్‌ల ఈ టెస్ట్ సిరీస్‌లో భాగంగా బ్రిస్బేన్‌లోని గాబాలో జరిగిన రెండో మ్యాచ్‌ను ఆస్ట్రేలియా అతి సులభంగా 8 వికెట్ల తేడాతో గెలుచుకుంది. దీంతో యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి టెస్ట్‌ను కూడా ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ జట్టు 241 పరుగులకే ఆలౌట్ అయింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ అత్యధికంగా 50 పరుగులు చేయగా, చివర్లో విల్ జాక్స్ 41 పరుగులు జోడించాడు. జాక్ క్రాలీ (44), ఓలీ పోప్ (26) మంచి ఆరంభాలు లభించినా, వాటిని పెద్ద ఇన్నింగ్స్‌లుగా మార్చలేకపోయారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాకు 177 పరుగుల ఆధిక్యం లభించింది. దీని కారణంగా ఇంగ్లాండ్ ఆస్ట్రేలియాకు కేవలం 65 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఇవ్వగలిగింది. ఆస్ట్రేలియా తరఫున రెండో ఇన్నింగ్స్‌లో మైఖేల్ నేసర్ 5 వికెట్లు తీశాడు. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ చెరో 2 వికెట్లు, బ్రెండన్ డాగెట్ ఒక వికెట్ పడగొట్టారు. 65 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 2 వికెట్లు కోల్పోయి 10 ఓవర్లలోనే ఛేదించింది. స్టీవ్ స్మిత్ 9 బంతుల్లో 23 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, ట్రావిస్ హెడ్ 22, జేక్ వెదర్‌రాల్డ్ 17 పరుగులు చేశారు. మార్నస్ లబుషేన్ (3) తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. ఇంగ్లాండ్‌కు గస్ అట్కిన్సన్ రెండు వికెట్లు తీశాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయం సరైనదే అనిపించేలా జో రూట్ ఆస్ట్రేలియాలో తన తొలి టెస్ట్ సెంచరీ (138 పరుగులు) చేయడంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేయగలిగింది. దీనికి జవాబుగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా తరఫున జేక్ వెదర్‌రాల్డ్ (72), మార్నస్ లబుషేన్ (65), స్టీవ్ స్మిత్ (61), అలెక్స్ కారీ (63), మిచెల్ స్టార్క్ (77) అర్ధ సెంచరీలు సాధించారు. పెర్త్ టెస్ట్ తర్వాత గాబాలో కూడా మిచెల్ స్టార్క్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. స్టార్క్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. స్టార్క్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీయడంతో పాటు, 77 పరుగులు కూడా చేశాడు.



## సింహాచలం అప్పన్న సేవలో కోహ్లీ



టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సింహాచలం వరాహ లక్ష్మీ వరాహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడేందుకు వచ్చిన విరాట్.. ఆదివారం ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విరాట్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో విరాట్‌కు స్వామివారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించి, శేషవస్త్రంతో సత్కరించారు. స్వామి వారికి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా విరాట్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకొని ఎంతో పారవశ్యానికి లోనైనట్లు విరాట్ తెలిపాడు.



### మాజీ లవ్ బర్డ్స్ అధికారిక ప్రకటన

### మా దారులు వేరు అని వెల్లడి

## స్మృతి-పలాష్

# పెళ్లి క్యాన్సిల్

భారత మహిళా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ వివాహం అధికారికంగా రద్దయింది. చాలా సస్పెన్స్ తర్వాత స్మృతి మంధాన తొలిసారి మౌనం వీడింది. తన పెళ్లి క్యాన్సిల్ అయిందని అధికారికంగా ప్రకటించింది. తమ కుటుంబాలు వివాహాన్ని రద్దు చేశాయని పేర్కొంది. 'గత కొన్ని వారాలుగా నా జీవితంపై ఎన్నో వదంతులు వస్తున్నాయి. నా పెళ్లి క్యాన్సిల్ అయిందని క్లారిటీ ఇస్తున్నా. నేను ఈ విషయాన్ని ఇంతటితో వదిలేస్తున్నా. మీరూ నాలాగే వదలేయండి. ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఇండియా తరఫున ఎన్నో ట్రోఫీలు గెలవడమే నా లక్ష్యం' అని ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది తన దృష్టి అంతా క్రికెట్‌పైనే ఉంటుందని, దేశానికి అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించింది. 'నాకు ఎల్లప్పుడూ ఉన్నతమైన లక్ష్యం ఉంది. అదే అత్యున్నత స్థాయిలో నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం. నేను వీలైనంత కాలం భారత్ తరఫున ఆడాలని, ట్రోఫీలను గెలవాలని ఆశిస్తున్నాను. నా దృష్టి ఎల్లప్పుడూ దానిపైనే ఉంటుంది. మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇక ముందుకు సాగాల్సిన సమయం వచ్చింది' అని తెలిపింది.

### స్పందించిన పలాష్ ముచ్చల్

క్రికెటర్ స్మృతి మంధాన తన వివాహాన్ని రద్దు చేసిన తర్వాత సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్ స్పందించారు. తన వ్యక్తిగత సంబంధం నుంచి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు పలాష్ తెలిపారు. అలాగే తనపై తప్పుడు, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను వ్యాప్తి చేస్తూ తనను అప్రతిష్టపాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కష్టకాలం తన జీవితంలో అత్యంత కష్టమైన దశ అని పేర్కొంటూ.. తన వ్యక్తిగత సంబంధం నుంచి తాను ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 'నేను నా జీవితంలో ముందుకు సాగాలని, నా వ్యక్తిగత సంబంధం నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. నాకు అత్యంత పవిత్రమైన విషయంపై నిరాధారమైన పుకార్లకు ప్రజలు ఇంత సులభంగా స్పందించడం నాకు చాలా కష్టంగా ఉంది. ఇది నా జీవితంలో అత్యంత కష్టమైన దశ, నేను నా నమ్మకాలను కాపాడుకుంటూ దీన్ని ఎదుర్కొంటాను. ప్రతి ఒక్కరూ ధ్రువీకరించని గాసిప్‌ల ఆధారంగా ఇతరులను అంచనా వేయడానికి ముందు ఒకసారి ఆలోచించడం నేర్చుకోవాలని నేను నిజంగా ఆశిస్తున్నాను. మన మాటలు మనకు తెలియని విధంగా ఇతరులను గాయపరచవచ్చు. నాపై తప్పుడు, పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను వ్యాప్తి చేస్తున్న వారిపై నా బృందం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్ట సమయంలో దయతో నాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నాడు.



## కోహ్లీ వర్సెస్ గంభీర్ మళ్లీ..!

దక్షిణాఫ్రికా జట్టుపై భారత్ వన్డే సిరీస్ కైవసం చేసుకున్న అనంతరం విరాట్ కోహ్లీ స్టేడియంలో వ్యక్తం చేసి హావభావాలు మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా సహచర ఆటగాళ్లు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను ఉత్సాహంగా ఆలింగనం చేసుకున్న విరాట్ కోహ్లీ.. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను కేవలం కరచాలనంతోనే సరిపెట్టడం పలు అనుమానాలకు దారితీసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీ (302 పరుగులు, 2 సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ) అత్యద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అయితే జట్టు విజయం తర్వాత ఆటగాళ్ల మధ్య జరిగే సహజమైన కౌగిలింతలు, ఆత్మీయ పలకరింపుల సమయంలోనే ఈ 'వివాదం' వెలుగులోకి వచ్చింది.

## టీ20లకూ గిల్ కెప్టెన్‌గా ఉండాలి



టీ20ల్లోనూ గిల్‌ను కెప్టెన్‌గా చేయాలని చాలా మంది బీసీసీఐకి సూచిస్తున్నారు. ఈ జాబితాలోకి తాజాగా భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ చేరాడు. అన్ని ఫార్మాట్లలో గిల్‌ను కెప్టెన్‌గా నియమించాలని గంగూలీ అభిప్రాయపడ్డాడు. 'సౌతాఫ్రికాతో తొలి టెస్టు సందర్భంగా ఈడెన్ గార్డెన్స్‌లో ఒకరితో నాకు ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. శుభ్‌మన్ గిల్ టీ20ల్లో కూడా కెప్టెన్‌గా ఉండాలని మీరు కోరుకుంటున్నారా? ఒకరు నన్ను అడిగారు. వెంటనే నేను అవునాని సమాధానమిచ్చాను.




## రో-కో భిన్నం

భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని ఇతర ఆటగాళ్ల కంటే భిన్నంగా చూడాల్సిన అవసరం ఉందని భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రో-కో ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్, కోహ్లీ అదరగొట్టారు. ఈ జోడీ 2027 ప్రపంచ కప్ వరకు కెరీర్ కొనసాగించాలని కోరుకుంటోంది. అయితే, వీరిని దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని బీసీసీఐ కోరినట్లు సమాచారం. అందుకు ఈ ద్వయం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 'జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల స్థానాన్ని ఎన్నడూ ప్రశ్నించకూడదు. ఎన్నో ఏళ్లుగా వారు జట్టు కోసం ఏం చేశారో చూడండి. వారిద్దరూ రెండు ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యారు. కానీ, ఫామ్ విషయంలో వారికి పెద్దగా ఇబ్బంది ఉండదు. వారికి ఆట కొత్త కాదు. కొన్ని ఓవర్లు ఆడితే లయ అందుకుంటారు. యువ ప్లేయర్లలా వీళ్లు ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరం లేదు. పరుగులు చేయాలనే తపన ఉండి ఫిట్‌గా ఉన్న నాణ్యమైన ఆటగాళ్లు మనకు అవసరం. ఈ విషయంలో రో-కోకు ఢోకా లేదు. వారిని ఇతర క్రికెటర్ల కన్నా భిన్నంగా చూడాలి. వారి ఉనికి డ్రెస్సింగ్ రూమ్ వాతావరణాన్ని మారుస్తుంది' అని సంజయ్ బంగర్ అన్నాడు.

## కోహ్లీ 100 సెంచరీలు చేస్తాడు



విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు పూర్తి చేసుకునే అవకాశముందని వెటరన్ బ్యాటర్ సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు. 2027 వరల్డ్ కప్ తర్వాత కూడా కెరీర్‌ను కొనసాగించే సత్తా కోహ్లీకి ఉందన్నాడు. 'ఎందుకు సాధ్యం కాదు? కోహ్లీ ఇంకా కనీసం మూడు సంవత్సరాలు ఆడినా వందకు చేరేందుకు 16 సెంచరీలు అవసరం. సౌతాఫ్రికాతో సిరీస్‌లో అద్భుతంగా ఆడిన కోహ్లీ మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లోనూ మరో రెండు శతకాలు చేస్తే అప్పుడు విరాట్ సెంచరీల సంఖ్య 86కు చేరుతుంది. 2027 వరల్డ్‌కప్ ముగిసేనాటికి భారత్ దాదాపు 35 వన్డే మ్యాచ్‌లు ఆడే అవకాశముంది. కోహ్లీ వీటన్నింటిలో ఆడి ఇదే ఫామ్ కొనసాగిస్తే 100 సెంచరీలు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కోహ్లీ తన బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. వన్డేల్లో విరాట్ టీ20 క్రికెట్ మాదిరిగానే ఆడటం చాలా అరుదుగా చూశాం. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు నెల రోజుల విరామం దొరికింది. ఈ గ్యాప్‌లో అతని ఫామ్ ఏమవుతుందో చూడాలి. ఈ విరామం లేకపోతే కివీస్‌తో సిరీస్‌లో కచ్చితంగా రెండు లేదా మూడు సెంచరీలు సాధించేవాడు అని నేను కచ్చితంగా అనుకుంటున్నా' అని పేర్కొన్నాడు.

## ఐయామ్ సారీ: సఫారీ కోచ్

టీమిండియాకు సౌతాఫ్రికా కోచ్ షుక్రి కాన్రాడ్ క్షమాపణలుచెప్పాడు. గువాహటి వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్టు సందర్భంగా సఫారీ కోచ్ షుక్రి కాన్రాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత ప్లేయర్లు సాష్టాంగ నమస్కారం చేసే వరకు డిక్లేర్ ఇవ్వబోమంటూ కామెంట్ చేశారు. ఆ సందర్భంగా గ్రోవెల్ అనే పదాన్ని వాడారు దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి కాన్రాడ్. అయితే ఆ వ్యాఖ్యలపై తాజాగా వివరణ ఇచ్చారు షుక్రి కాన్రాడ్. ఆ పదాలను ఉపయోగించినందుకు క్షమాపణలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి దురుద్దేశంతో ఆ కామెంట్ చేయలేదని క్లారిటీ ఇచ్చారు. భారతీయులు అంటే తమకు అభిమానమని పేర్కొన్నారు. 'ఎవరినీ కించపరచాలని ఆ పదం వాడలేదు, ఆ పదం స్థానంలో వేరే పదాన్ని వాడితే సరిపోయేది' అంటూ వెల్లడించారు. ఇకపై తన భాష పట్ల చాలా జాగ్రత్తగా ఉంటానని వివరించారు. నా వ్యాఖ్యల నేపథ్యంలో వన్డే సిరీస్ ను ఇండియా చాలా కసిగా ఆడినట్లు వెల్లడించారు. ఇక ఇప్పుడు టీ20 సిరీస్ కూడా చాలా ఆసక్తిగా మారబోతోందని స్పష్టం చేశారు.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 8-12-2025 | www.evarthalu.com

# రావణ రహస్యం



రావణ లంక దొరికింది..
సీతను దాచిపెట్టిన లంక దొరికింది..
ఆంజనేయుడు సంజీవినీ పర్వతాన్ని తీసుకువచ్చి
లక్ష్మణుణ్ణి కాపాడిన లంక దొరికింది..
రామ రావణ యుద్ధం జరిగిన లంక దొరికింది.
ఇవి ఒట్టి మాటలు కావు.. పుక్కిటి పురాణం అంతకంటే కాదు..
లక్షల సంవత్సరాల నాటి యథార్థ గాథ..
ఒక మహా అసురుని ఉనికిని చాటి చెప్తున్న కథ..
మిథ్యగా భావిస్తున్న చరిత్ర.. రావణ రహస్యమిది!

ఇదేదో సోది కథ కాదు.. రావణ లంక.. ఇది ఒక నిజం.. నిప్పులాంటి నిజం... వైజ్ఞానికులకు కొత్త సవాలును విసురుతున్న నిజం.. భారత దేశ చరిత్రను గొప్ప మలుపు తిప్పనున్న నిజం. ఒకనాడు రావణుని రాజరికం అప్రతిహతంగా సాగిన రాజ్యం... సాక్ష్యాలతో సహా లభించింది. రామ రావణ యుద్ధంలో ఆనాడు రావణుడు చనిపోయి వుండవచ్చు. కానీ, శ్రీలంకలో కనిపిస్తున్న సాక్ష్యాలలో రావణుడు ఇంకా జీవించే వున్నాడు.. ఇది నిప్పులాంటి నిజం. లంక మిథ్య కాదు.. లంకేశ్వరుడు రాజ్యమేలిన లంక.. ప్రపంచాన్నంతా జయించి తెచ్చిన బంగారంతో నిర్మించిన మహానగరం లంక.. సముద్రం మధ్యలో అందమైన దీవిలో, అపురూపంగా రావణుడు నిర్మించుకున్న నగరం లంక. శ్రీలంక సర్కారే రావణుడి ఆనవాళ్లను అధికారికంగా గుర్తించింది. రాజముద్ర వేసింది. రావణ ఆనవాళ్లు శ్రీలంకలో అడుగడుగునా కనిపిస్తున్నాయి. అశోకవనంతో ఈ గుర్తులు మొదలవుతాయి. అశోక వాటిక అని పిలిచే ఈ వనంలోనే సీతాదేవిని ఆనాడు రావణుడు బంధించి ఉంచాడు. ఈ ప్రదేశంలో ఎవరు ప్రతిష్ఠించారో తెలియని వేల ఏళ్ల నాటి సీతారామచంద్రుల విగ్రహాలు మనకు కనిపిస్తాయి. ఈ ఆలయం పక్కనే సీతాజల పారుతుంది. సీతాదేవి కన్నీటితో ఏర్పడిన నీటి కుండమని ఇక్కడి ప్రజల విశ్వాసం.. ఈ నీటి కుండాన్ని ఆనుకుని హనుమంతుని అడుగులూ మనకు కనిపిస్తాయి. అశోక వాటిక సమీపంలో మొక్కల్లో నల్లని మట్టి ఉంది.. ఇది బాగా కాలిపోయి ఉన్నట్లు కనిపించే మట్టి ఇది. ఈ మట్టి ఇలా ఎందుకు ఉందో ఇప్పటి వరకు ఏ శాస్త్రవేత్తకూ అంతుపట్టలేదు.. అశోక వాటిక చుట్టూ లెక్కలేనన్ని కోతులు ఎప్పుడూ తిరుగుతూ వుంటాయి. ఈ ప్రదేశంలో ఇక్కడ మాత్రమే కోతులు కనిపిస్తాయి. సీతా జలకు దగ్గరలోనే మరో చిన్న ఏరు పారుతుంటుంది.. అది నిత్యం రావణుడు స్నానం చేసే ఏరు.. ఇక్కడ స్నానం చేసి పరమేశ్వరుని అర్చించేవాడు రావణుడు. ప్రతి చారిత్రక ప్రదేశాల్లో కొన్ని ప్రాంతాలను చూపి స్థల పురాణాలు చెప్పటం సహజమే.

**లంకలో కనిపిస్తున్న ఆనవాళ్లు కూడా ఇలాంటివే అనుకుంటే పొరపాటే. ఇవాల్టి శ్రీలంకలో నాటి తేజోమయ రావణ లంక స్మృతులు చాలా ఉన్నాయి. త్రేతాయుగాన్ని మనకు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. రావణ లంక సామాన్యమైంది కాదు.. రామాయణం ఉనికిని చాటిచెప్తున్న లంక.. రావణ స్నానం చేసే నది నుంచి దూరంగా చూస్తే ఓ పెద్ద పర్వతం కనిపిస్తుంది. ఆ పర్వతాన్ని జాగ్రత్తగా పరికిస్తే అతి పెద్ద హనుమాన్ ఆకృతి నిద్రిస్తున్నట్లుగా గోచరిస్తుంది.**

ఈ పర్వతాన్ని రాము సోలా అని ఇక్కడి ప్రజలు పిలుస్తారు.. ఈ పర్వతం ఒక విచిత్రమైన పర్వతం.. రామ రావణ యుద్ధం జరుగుతున్న సమయంలో లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు హనుమంతుడు హిమాలయాల నుంచి సంజీవని మొక్కను తీసుకువచ్చిన పర్వతం ముక్క ఇది. ఇది ఆంజనేయుడు సంజీవని తీసుకువచ్చిన సుమేరు పర్వతమనటానికి అనేక ఆధారాలు ఉన్నాయి. ఇలాంటి పర్వత భాగం శ్రీలంకలో మరెక్కడా కనిపించదు.. మనకు ఇది మామూలు కొండ.. కానీ, శ్రీలంక ప్రజలకు ఇది హాస్పిటల్... ఈ పర్వతంలో దొరికే మొక్కలన్నీ ఔషధ మొక్కలే కావటం ఇది సుమేరువే అనటానికి బలమైన సాక్ష్యం. దీనికి దగ్గరలో ఉన్న ప్రజలు ఏ జబ్బు వచ్చినా డాక్టర్ల దగ్గరకు వెళ్లరు.. ఈ పర్వతం దగ్గరకు వచ్చి ఇక్కడి మొక్కలతోనే వైద్యం చేసుకుంటారు. విచిత్రమేమంటే ఈ ఔషధ మొక్కలు పెరగాలంటే ప్రత్యేకమైన మట్టి కావలసి ఉంటుంది. ఈ కొండపై మనకు కనిపించే మట్టి హిమాలయాల్లో మాత్రమే కామన్గా కనిపిస్తుంది. రావణుడు దశకంఠుడు.. అంటే పది తలలు ఉన్నవాడు.. అంటే శారీరకంగా కాదు.. అతనిలో పది రకాల వ్యక్తిత్వాలు ఉన్నాయని అర్థం. అతని మేధస్సు పది రకాలుగా, అనేక రంగాల్లో విస్తరించిందని అర్థం. ఇందుకు సాక్ష్యం మనకు లంకలో స్పష్టంగా కనిపిస్తుంది. అతను పండితుడో, సీతను అపహరించుకు వచ్చిన రాక్షసుడో మాత్రమే కాదు.. రావణుడు గొప్ప శాస్త్రవేత్త కూడా. రావణుడి అస్తిత్వాన్ని, అతని శక్తిసామర్థ్యాలను చాటి చెప్పే మరో ప్రబలమైన సాక్ష్యం ఇది. మీకు పుష్పక విమానం గుర్తుంది కదా? అందులోనే సీతాదేవిని రావణుడు అపహరించుకు వెళ్లాడు. రావణ సంహారం తరువాత రాముడు అందులోనే అయోధ్యకు తిరిగి వచ్చాడు. ఆ కాలంలో విమానాలు ఉన్నాయా? అంటే ఉన్నాయని లంక చెప్తోంది.. చూపిస్తోంది.

లంకాపట్టణంలో రావణుడు నిర్మించిన అయిదు విమానాశ్రయాలను శ్రీలంక సర్కారు గుర్తించింది. అంతే కాదు.. ఒక విమానాల మరమ్మతు కేంద్రాన్ని కూడా గుర్తించింది. వీటిని హనుమంతుడు లంకాదహన సమయంలో కాల్చివేశాడు. లంకలో ఒక గరుడ పక్షి ఆకృతిలో లోహపు బొమ్మ దొరికింది.. ఈ బొమ్మ మామూలు విగ్రహం కాదు.. దీనికి ఉన్న రెక్కలు సాధారణ గరుడ పక్షికి ఉండే స్థాయి కంటే కొద్దిగా ఎత్తులో ఉన్నాయి. దీనిపై ముగ్గురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు.. వాస్తవానికి ఇది ఓ లోహయంత్రం. వేల ఏళ్ల నాటిది. ఆనాడు ఇది ఎలా ఎగిరిందీ అన్నదానిపై లంక ప్రభుత్వం ఇంకా పరిశోధిస్తూనే ఉంది. ఇక విమానాశ్రయం దగ్గరకు వస్తే.. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి దాదాపు తొమ్మిది గంటల పాటు ప్రయాణం చేస్తే ఓ పెద్ద పర్వత ప్రాంతం వస్తుంది. ఇక్కడ దాదాపు ఎనిమిది వేల అడుగుల ఎత్తున సుమారు ఎనిమిది కిలోమీటర్ల విస్తీర్ణంలో మైదాన ప్రాంతం ఉంది. అంత ఎత్తున ఇంత విస్తీర్ణంలో మైదానం ఉండటం, ఈ మైదానానికి నాలుగు వైపులా కొండలు ఉండటం విశేషం. ఈ మైదానం మానవ నిర్మితమైనదేనని స్పష్టంగా కనిపిస్తోంది. దీన్నే రావణుడు తన విమానాశ్రయంగా వినియోగించాడని శ్రీలంక రీసర్చ్ టీమ్ నిర్ధారించింది. మరో విశేషమేమంటే ఈ మైదానం అంతటా కాలిపోయిన గుర్తులున్నాయి. ఇక్కడి మట్టి కాలి నల్లగా మాడిపోయింది. ఇక్కడి రాళ్లు కాలి కనిపిస్తున్నాయి. 8 వేల అడుగుల ఎత్తులో తక్కువ వాతావరణం ఉన్న ఈ ప్రాంతంలో ఇంకా వేడి వాతావరణం ఉండటం విశేషం. లంకాదహనం చేసినప్పుడు హనుమంతుడు ముందుగా రావణుడి ట్రాన్స్పోర్ట్ సిస్టము, కమ్యునికేషన్ వ్యవస్థలనే దహనం చేశాడు.. అందుకు సాక్ష్యం ఈ విమానాశ్రయం. పుష్పక విమానం చాలా పెద్దది. 63.5 అడుగుల పొడవైనది. 231 4" ఎత్తు. 195'8" వెడల్పున్న రెక్కలు కలిగింది. బయటి ఉపరితలం వెండి రంగులో మిలమిల మెరుస్తుంది. దాని ఇంజన్ ఉరుముల వంటి ధ్వనిని వినిపించేది. గంటకు దాదాపు 250 మైళ్ల వేగంతో ప్రయాణించేది, అందువల్లే సూర్యాస్తమయం లోగా అయోధ్యకు చేరుకోవాలంటే పుష్పకంలో ప్రయాణించాలని విభీషణుడు రాముడిని కోరాడు. అరు గంటల్లో 1400 కిలోమీటర్లను అది కవర్ చేస్తుందిట. లక్జరీ సీట్లు, ఇంటీరియర్, ఎక్స్టీరియల్ డెకొరేషన్లతో ఆధునిక విమానాలకు తీసిపోని విధంగా పుష్పకం ఉండేది. లోపల మెలోడీ సంగీతం కూడా వినిపించే ఏర్పాట్లు చేశాడట రావణుడు. ప్రస్తుత విమానాల్లో ఫస్ట్ క్లాస్, ఎకానమీ క్లాస్లు ఉన్నట్లే పుష్పకంలోనూ వున్నాయి. మొదటి పోర్షన్లో రాముడు కూర్చుంటే, రెండో పోర్షన్లో వానరులు కూర్చున్నారట. దాదాపు 200 మందికి పైగా పుష్పకంలో కూచున్నారు కాబట్టే ఎందరు కూచున్నా ఒకరికి చోటుం టుందనే మాట ప్రచారంలోకి వచ్చింది.

రావణుడికి సంబంధించిన వివరాలు ముఖ్యంగా వాల్మీకి రామాయణంలో, ఆ తరువాత తులసీదాస్ రామచరిత మానస్లో మనకు ముఖ్యంగా కనిపిస్తాయి.. ఇవన్నీ మనకు ఇప్పుడు లంకలో కనిపిస్తున్న ఆనవాళ్లతో సరిపోలుతున్నాయి. తులసీదాస్ రాసిన రామచరితమానస్ ఒరిజినల్ ప్రతి ఒకటి చిత్రకూటంలో భద్రంగా ఉంది. అయితే ఆయన స్వయంగా రాసిన వాటిలో ఒకే ఒక అధ్యాయం ప్రపంచానికి మిగిలి ఉంది. చేత్తో తయారు చేసిన కాగితంపై రాసిన ఈ రామాయణంలో మిగిలి ఉన్న అధ్యాయం 117 పేజీల్లో వుంది. ఒక్కో పేజీకి 7లైన్లు రాసి ఉంది. అందులోనే ఈ వివరాలు ఉన్నాయి. కెలినియా.. రావణుడి తమ్ముడు విభీషణుడి రాజభవనం ఉన్న ప్రాంతం.. ప్రస్తుతం బౌద్ధ ధర్మాన్ని పాటిస్తున్న శ్రీలంకలో కెలినియా చాలా ముఖ్యమైన ప్రదేశం. బుద్ధ భగవానుడు ఈ ప్రాంతానికి వచ్చినట్లు చరిత్ర చెప్తోంది. ప్రపంచంలోని బౌద్ధులు శ్రీలంకకు వస్తే కెలినియా చూడకుండా వెళ్లరు.. ఆ పక్కనే విభీషణుడి భవనాన్నీ సందర్శిస్తారు.. ఇంతెందుకు లంక పార్లమెంటులో విభీషణుడి ఫోటో కనిపిస్తుంది. ఆ తరువాత రోలియా.. ఇక్కడే అశోక్ వాటిక ఉంది. దీనికి సమీపంలోనే సీతాదేవి అగ్ని ప్రవేశం చేసింది. అయితే ఇక్కడ ఓ విచిత్రం ఉంది. ఇక్కడ అటవీ ప్రాంతంలో కొన్ని చిత్రమైన గోళీలు దొరుకుతాయి. ఈ గోళీలను సీతా గోళీలంటారు.. ఇవి అలోపతీ మాత్రల్లాంటివి.. ఈ గోళీలు దొరడమే భాగ్యంగా ప్రజలు భావిస్తారు.

**వీటిని తలకు రాసుకోవటం, కడుపుకు రాసుకోవటం, వాటిని పొడిని చేసి కొద్దిగా తీసుకోవటం వంటివి. చేస్తారు.. ఈ గోళీలను శ్రీలంక ప్రభుత్వం జపాన్కు పంపించి పరీక్ష చేయించింది. ఇందులో వైద్య లక్షణాలు ఉన్నట్లు.. దాదాపు పదివేల సంవత్సరాలకు పూర్వ కాలం నాటివేనని నిర్ధారణ అయింది. రావణుడికి సంబంధించి ఇప్పటివరకు లభించిన ఆధారాలన్నీ ఒక ఎత్తైతే, అసుర రాజు అస్తిత్వానికి సంబంధించిన అతి కీలక సాక్ష్యం మరొకటి ఉంది. అది రావణ గుహ.**

లంకలో రామరావణ యుద్ధం భీకరంగా జరిగింది. రామబాణంతో రావణుడిని శ్రీరామచంద్రుడు హతమార్చాడు. రావణుడు మరణించిన తరువాత ఏం జరిగింది? వాల్మీకి రామాయణంలో రావణుడి అంత్యక్రియలు, ఆ తరువాత విభీషణుడి పట్టాభిషేక కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు లక్ష్మణుడిని రాముడు లంకకు పంపిస్తాడు. కానీ రావణుడి అంత్యక్రియలు జరగనే లేదన్నది కొందరి విశ్వాసం. దానికి సంబంధించిన అత్యంత గొప్ప రహస్యం వెలుగులోకి తెచ్చింది లంక సర్కారు.. అదే రావణ గుహ. శ్రీలంకలోని కెలినియాకు కొద్ది దూరంలో ఎత్తైన ప్రదేశంలో ఈ గుహ ఉంది.. ఈ గుహలోకి ప్రవేశించటం చాలా కష్టమైన పని.. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం పశువులు కాసుకునే ఒక కాపరి ఈ గుహలోకి అనుకోకుండా వెళ్లాడు. ఈ గుహలో ఒక పెద్ద శవపేటిక ఉంది.. ఈ పేటికలో ఒక శవం ఉందని, దాన్ని చూడగానే భయంతో వెనక్కి వచ్చేసినట్లు అతను చెప్పాడు. అది అవణుడి భౌతిక శరీరమని చాలా మంది విశ్వాసం.. ఈ శవపేటిక దాదాపు పదిహేడు అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడలు)తో ఉంది. ఈ శవపేటిక చుట్టూ రకరణాల రసాయన లేపనాలు రాసి ఉన్నాయి. రావణుడు చనిపోయిన తరువాత ఆయన భౌతిక దేహాన్ని నాగజాతి ప్రజలు తీసుకెళ్లి ఈ శవపేటికలో భద్రపరిచారట. శ్రీలంక ప్రభుత్వం ఒక ప్రత్యేక బృందాన్ని పంపించి ఈ శవపేటికను తెరిచేందుకు పలుమార్లు ప్రయత్నించింది. ప్రయత్నించిన ప్రతిసారీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే ఉంది. ఒకసారి చిరుతపులులు, మరోసారి పెద్ద పాములు అడ్డం వచ్చాయి. హెలికాప్టర్లో వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు సరిగ్గా గుహ దగ్గరకు వచ్చేసరికి వాతావరణం హఠాత్తుగా మారిపోయి తప్పనిసరిగా వెనక్కి మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గుహలో అతని అనుచరులు కాపలా ఉన్నారని, లక్ష్మణుడి మాదిరిగా సంజీవనితో తమ రాజు పునర్జీవుతుడవుతాడని నమ్ముతున్నారని స్థానికుల అభిప్రాయం. కానీ వారిని చూసినవారెవరూ లేరు. రావణుడి ఉనికికి సంబంధించిన చాలా ముఖ్యమైన సాక్ష్యం ఇది. ఈ పేటిక రహస్యాన్ని ఛేదించగలిగితే చరిత్రలో అనేక కొత్త కోణాలు వెలికి వస్తాయి. దీనితో పాటు లంకలో మరికొన్ని అంశాలను పరిశీలించాల్సి ఉంది. రావణుడు సీతాదేవిని పంచవటి నుంచి అపహరించుకుని వెళ్లి ఎక్కడ దాచాడు? అని అడిగితే టక్కున వచ్చే జవాబు అశోక వనం.. కానీ లంక అదే శ్రీలంకలో సీన్ వేరేలా ఉంది. సీతాదేవిని పరిస్థితులను బట్టి, ముందు జాగ్రత్త చర్యగా వేర్వేరు ప్రదేశాలకు రావణుడు తరలించాడట. పంచవటిలో, పర్ణశాలలో ఉన్న సీతాదేవిని తన పుష్పకంలో లంకకు తీసుకువచ్చిన రావణుడు వెరగన్ తోటలోని తన ఎయిర్పోర్ట్లో ల్యాండ్ అయ్యాడు.. పక్కనే ఉన్న తన భార్య మండోదరిదేవి భవనానికి సీతమ్మను తీసుకువెళ్లాడు.

**లంకాపురంలో అతిగొప్ప ప్యాలెస్ మండోదరికి ఉండేదిట.. చుట్టూ జలపాతాలు.. పూల తోటలు. అక్కడ సీత ఉన్నది కొన్ని రోజులే. ఆ తరువాత అశోకవాటికకు తరలించాడు. మండోదరి భవనానికి చాలా దూరంలో అశోక వాటిక ఉంది. అక్కడికి విమానంలోనే సీతను రావణుడు తీసుకువెళ్లాడు.. ఆకాశమార్గంలో లంకానగర సౌందర్యాన్ని అద్భుతంగా ఏరియల్ వ్యూ ద్వారా సీతాదేవికి వర్ణిస్తూ చూపించాడట రావణుడు.**

అశోక వాటికకు సమీపంలోనే సీతా పకన్ అనే చిన్న ప్రాంతం ఉంది.. చుట్టూ కమ్ముకుని ఉన్న దట్టమైన అడవి.. నిటారుగా నిలుచుని వున్న వృక్షాల మధ్య 200 గజాల మేరకు వున్న చిన్న స్థలం.. అంత అడవిలో ఇక్కడ చిన్న మొక్క కూడా మొలవదు.. గతంలో ఇక్కడ నీళ్లు ఉండేవట.. సీతాదేవి లంకనుంచి అయోధ్యకు వెళ్లిన తరువాత ఇది పూర్తిగా డ్రై అయిపోయింది. హనుమంతుడు లంకకు వచ్చి చేయాల్సిన బీభత్సం అంతా చేసేశాక, ముందు జాగ్రత్త చర్యగా రావణుడు సీతాదేవిని అశోకవాటిక నుంచి ఇస్త్రిపురకు తరలించాడట. అంటే ఏరియా ఆఫ్ వుమెన్ అని అర్థం. ఇక్కడి నుంచి కూడా రావణ గోడా అనే ప్రాంతానికి సీతను షిఫ్ట్ చేసినట్లు చెప్తారు.. అది ఇస్త్రిపురకు మరోవైపున ఉంది. దానికి దగ్గరలోనే దిశృంపోలా అంటారు ఇప్పుడు ఇక్కడ బుద్ధుడి ఆలయం ఉంది. దీంతో పాటే అతి ముఖ్యమైన ప్రాంతం ఇది. రావణ సంహారం తరువాత సీతాదేవి అగ్ని ప్రవేశం చేసిన ప్రదేశం ఇదే... ఇక్కడ బౌద్ధ మతాచార్యులు ఓ స్తూపాన్ని కూడా నిర్మించారు.. లంకలోని జెలినియాలో రావణ సోదరుడు విభీషణుడికి పట్టాభిషేకం జరిగినట్లు గతంలోనే చెప్పుకున్నాం... ఇక్కడ విభీషణుడికి ఓ ఆలయం కూడా ఉంది.. లంక పార్లమెంటులో కూడా విభీషణుడి చిత్రపటం మనకు కనిపిస్తుంది.. అంతే తప్ప అంత గొప్ప నాగరికతను ప్రపంచానికి అందించిన రావణుడికి మాత్రం ఎక్కడా ఆలయం లేదు. రావణుడి కొడుకు ఇంద్రజిత్.. ఇతను కూడా శివుడికి మహా భక్తుడు.. ఈతడు శివుని పూజించిన ఆలయం, అందులో శివలింగం ఇవాల్టికీ పూజలందుకుంటున్నాయి.

**రావణుడి తల్లి కేకసి.. ఈమె భవనం సముద్రానికి సమీపంలో ఉండేది.. ఆమె నిత్యం ఉదయం ఇసుకతో శివలింగాన్ని తయారుచేసి దానికి పూజ చేసి వచ్చేది.. శ్రీలంకలోని తిరుక్కోవిల్లో ఆమె తల్లి భవంతి ఉండేది.. ఇప్పుడా ప్రాంతంలో దేవాలయం ఉంది.. ఇక్కడో విచిత్రం ఉంది.. తన తల్లి మరణించిన తరువాత ఆమె అంత్యక్రియలు జరిపిన తరువాత స్నానాదులకు మంచినీరు కరవైందట.. అప్పుడు రావణుడు తన త్రిశూలంతో ఏడుసార్లు నేలను గట్టిగా కొట్టాడట.. దీంతో ఏడు ప్రాంతాలలోని నీటిధార ఉబికి వచ్చింది. సముద్రానికి దగ్గరలో మంచినీటి బావులు ఇవి. ఈ ఏడింటిలో నీటి ఉష్ణోగ్రతలు ఏడు. రకాలుగా ఉండటం ఇక్కడి విచిత్రం.**

తోటపాలకొండలో రావణుడి అతి పెద్ద గోశాల ఉంది.. లంకారాజ్యానికంతటికీ అదే ఏకైక డైరీఫారమ్.. శ్రీలంకలోనే కలుతర అన్న ప్రాంతంలో రావణుడికి మరో కోట వుండేది.. ఈ కోట ఇప్పుడు సముద్ర గర్భంలో కలిసిపోయిందని చెప్తారు.. దీనికోసం లంక సర్కారు పరిశోధిస్తోంది.. ఇప్పుడు ఈ ప్రాంతంలో లైట్ హౌస్ కనిపిస్తుంది. ఇక్కడ హనుమంతుడి గురించి కొంత చెప్పుకోవాలి.. లంకాదహనం చేశాక ఓ ప్రాంతంలో కాసేపు రెస్ట్ తీసుకున్నాడు.. దాన్ని ఇప్పుడు రామ్ బోడా అంటారు.. అక్కడ చిన్మయ మిషన్ వాళ్లు అతి పెద్ద ఆలయ నిర్మాణం చేశారు.. రామాయణంలో మనకు తెలిసిన రావణుడు వేరు.. లంకలో కనిపిస్తున్న రావణుడు వేరు.. ఆయన సీతను ఎత్తుకుపోయిన సంగతే చాలామందికి తెలుసు.

ఆయన పండితుడన్న సంగతి కొందరికి తెలుసు.. కానీ, రావణుడిలో మనకు అంతు చిక్కని అనేక కోణాలు ఉన్నాయి. రావణుడు ఆర్కిటెక్చర్.. రావణుడు ఏరోనాటికల్ ఇంజనీర్.. రావణుడు డాక్టర్.. రావణుడు వార్ఫేర్ టెక్నాలజిస్ట్.. రావణుడు నిత్య పరిశోధకుడు.. రావణుడు గొప్ప సంగీతవేత్త.. ఇలా చెప్పుకుంటూ పోతే రావణుడిలో అనేక కోణాలు బయటపడతాయి. తన భార్య మండోదరితో సరదాగా ఆడుకోవటానికి చెస్సు కనుక్కొన్నాడట. ఆమెతో కలిసి వీణ అద్భుతంగా వాయించేవాడట రావణబ్రహ్మ. రావణుడికి సంబంధించి అయిదు విమానాశ్రయాలను లంక సర్కారు కనుక్కొందని చెప్పుకున్నాం. గుర్లపోతలో విమాన మరమ్మతు కర్మాగారం ఉంది. వాల్మీకి రామాయణంలోనూ ఈ గుర్లపోత ప్రస్తావన వుంది. రావణుడి విమానం పెద్ద నెమలి ఆకారంలో ఉండేదిట.. దీనిని సింహళభాషలో గుర్లపోత అంటారు.. అంటే పక్షి వాహనం అని అర్థం. విమానాన్ని సింహళ భాషలో దండు మోనరా అంటారు.. అంటే ఎగిరే నెమలి అని అర్థం.

రావణ లంకానగరం అపూర్వమైంది.. అపూర్వ నిర్మాణాన్ని కలిగి ఉన్నది.. లంకానగరం శత యోజన విస్తీర్ణంలో నిర్మించారని రామాయణం చెప్తోంది.. ఒక యోజనం అంటే 13 కిలోమీటర్లు. ఇవాల్టి శ్రీలంక విస్తీర్ణం, రామాయణంలో పేర్కొన్న గణాంకాలు దాదాపుగా సరిపోతున్నాయి. ఏడు ప్రాకారాలు, ఎనిమిది ద్వారాలు.. మూడు కందకాలతో అత్యంత సురక్షితంగా లంకా నగరాన్ని నిర్మించాడట రావణుడు. ఆనాటి లంకలో నాలుగు లక్షల వీధులు ఉండేవిట. లంకలో చాలా ప్రాంతాల్లో అనేక గుహలు, సొరంగాలు కనిపిస్తాయి. ఇవన్నీ రావణ కాలం నాటివే. రావణ ఆర్కిటెక్చరల్ ప్రతిభకు ఇవి నిదర్శనంగా నిలుస్తాయి. ఈ సొరంగాలు లంకలోని అన్ని పట్టణాలకు ఒకదానితో మరొకటి లింక్ కలిపే నెట్వర్క్ వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఈ సొరంగాలు తొందరగా ఒకచోటి నుంచి మరోచోటికి తరలివెళ్లేందుకు సరైన రవాణా వ్యవస్థను కలిగి ఉన్నాయి. ఈ సొరంగాలు సహజంగా ఏర్పడినవి కావు.. ప్రతి సొరంగం మానవ నిర్మితమేనని స్పష్టంగా తెలుస్తుంది. రావణ గుహకే దాదాపు ఏడు వందల దాకా కిటికీలు ఉన్నాయి. ఎంత గొప్ప నగర నిర్మాణం.. ఎంత సాంకేతిక పరిజ్ఞానం.. ఎంత గొప్ప నాగరికత.. భారత దక్షిణాపథాన కనీవినీ ఎరుగని సాంస్కృతిక వైభవం విలసిల్లిన లంకానగరం ఎంత దారుణంగా ధ్వంసమైంది? తన ప్రజలకు ఎలాంటి కష్టం లేకుండా చేసిన సార్వభౌముడు ఎలా పతనమయ్యాడు..? చాలా ఆశ్చర్యంగా ఉంటుంది.. అబ్బురమేస్తుంది. ఒక దారుణమైన తప్పు ఎంత వినాశనానికి దారితీసిందో అర్థమవుతుంది. పద్నాలుగేళ్ల వనవాసానికి అయోధ్యనుంచి బయలుదేరిన రామచంద్రుడు చిత్రకూటం మీదుగా పంచవటికి వెళ్లాడు. అప్పటికి దండకారణ్యం దాకా రావణుడి ఆధిపత్యం కొనసాగినట్లు తెలుస్తుంది.. దండకారణ్యంలో రావణుడి గవర్నర్ ఖరుడు పరిపాలన సాగించాడు. రాముడు ఖరదూషణులను ఇక్కడే చంపాడు. పంచవటి నుంచి కిష్కింధకు వెళ్లిన రాముడు అక్కడ వానర సైన్యాన్ని కలుసుకున్నాడు.. ఆ సైన్యం తోనే శ్రీలంకకు చేరుకున్నాడు.

భారతీయ నిర్మాణ రంగంలోనే అపురూపమైన సేతువును రాముడు రామేశ్వరం మీదుగా లంకలోని తలైమన్నార్ దాకా నిర్మించాడు. వానర సైన్యంలోని నీలుడి పర్యవేక్షణలో ఈ సేతు నిర్మాణం సాగింది. శ్రీలంక సరిహద్దులకు చేరుకున్నాక రాముడు తన సైన్యంతో నీలవరై పుత్తూర్ దగ్గర మొదట ఆగాడట.. అక్కడ రాముడు తన సైన్యం కోసం సృష్టించిన నీటి జల ఇప్పటికీ కనిపిస్తుంది. నీలవరై పుత్తూర్ దగ్గర నుంచి లగ్గల అన్న ప్రాంతానికి రాముడి సైన్యం తరలింది.. లగ్గల అంటే టార్గెట్ రాక్ అని అర్థం.. ఈ పర్వత పైభాగం నుంచి రావణ సైన్యం రాముడి గురించిన సమాచారాన్ని అందించింది. ఈ ప్రాంతం భౌగోళికంగా ఉత్తర లంకలో అత్యంత ఎత్తైన ప్రాంతంలో వుంటుంది. ఈ ప్రాంతానికి ఈశాన్య భాగంలో తిరుకోణేశ్వరం ఉంది.. అటు వాయవ్య దిశలో తలైమన్నార్ ఉంటుంది.. రామసేతువు లంకకు కలిపింది ఇక్కడే.. ఈ తిరుకోణేశ్వరంలోనే రావణుడు తపస్సు చేసేవాడు. ఈ యుద్ధ భూమిలోనే భీకరంగా రామరావణుల పోరాటం జరిగింది. రామబాణానికి దశకంఠుడు నేలకొరిగాడు.. రాక్షస సంహారం జరిగింది. సుందరలంక స్మశానంగా మారిపోయింది.. రావణ సంహారంతో రామాయణం ముగియలేదు.. యుద్ధం తరువాత రాముడు సీతాలక్ష్మణ సమేతంగా బయలు దేరినప్పుడూ లంకలోని కొన్ని ప్రాంతాలలో ఆగాడు. సేద తీరాడు, పరమేశ్వరుని కొలిచాడు. రావణ వధ తరువాత సీతారామలక్ష్మణులు పుష్పకంలో అయోధ్యకు బయలు దేరుతూ వందారుమూలై అన్న ప్రాంతంలో కాసేపు ఆగారు.

**వందారుమూలైలో ఉన్నప్పుడు రాముడికి అనుమానం కలిగింది.. రావణుడు బ్రాహ్మణుడు.. అతణ్ణి చంపినందుకు తనకు బ్రహ్మహత్యాదోషం చుట్టుకుంటుంది కదా అన్న సందేహంతో దీనికి పరిష్కారం చెప్పమంటూ పరమేశ్వరుని కోరాడు.. అప్పుడు శివుడు నాలుగు ప్రాంతాలలో శివలింగాల్ని ప్రతిష్టించి పూజించమని రాముడికి సూచించాడట.. దీంతో రాముడు లంకలో మానావారి అన్న ప్రాంతంలో తొలి శివలింగాన్ని ప్రతిష్ఠించాడు.. దీన్ని రామలింగ శివుడని కొలుస్తారు.. ఆ తరువాత తిరుకోణేశ్వరంలో, అక్కడి నుంచి తిరుకేదారేశ్వరంలో మరో రెండు శివలింగాలను ప్రతిష్ఠించాడు... చివరగా భారత భూభాగంలో ఇప్పుడున్న రామేశ్వరంలో మరో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు.**

పుష్పకంపై తిరిగి వెళ్తూ, రాముడు రామసేతువును పాక్షికంగా ధ్వంసం చేసి వెళ్లాడని కూడా కథనం చెప్తారు.. మొత్తం మీద రావణ లంక భారతీయ నాగరికతలోని అనేక కొత్త కోణాలను వెలికి తీస్తున్నది.



**కోవెల సంతోష్ కుమార్**
రచయిత, 9052116463

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.